1.4.1994 శుక్రవారం, 12 పేజీలు, సంపుటి: 65, సంచిక: 13, విడిప్రతి: రు. 2.00 లు

జమీన్ రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి,

కలర్ ఆటో జెరాక్స్
శ్రీ రాఘవేంద్ర ఆటో జెరాక్స్
రాధా థియేటర్ ఎదురుగా
నెల్లూరు ఫోన్ : 23649
లామినేషన్ సౌకర్యం కలదు

మూలవిరాట్ మనసులో ఏముంది?

అసెంబ్లీలో ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నుంచైతే కోట్లవారు బయట పడగలిగారు కానీ సొంత పార్టీలో 'విశ్వాసం' సంపాదించడమే ఆయనకు కష్టంగా వుంది. అసెంబ్లీలో మూడింట రెండొంతులు మెజార్టీ వున్న కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్షాల అవిశ్వాసం

కోట్లవారి కోట బీటలు వారిపోతూంది; అధిష్ఠానం దాన్ని బ్రద్ధలు చేస్తుందా?

తిప్పికొట్టడం అసలు సమస్యే కాదు. కానీ సొంత పార్టీలో రోజు రోజుకు ముఖ్యమంత్రిపై పెరుగుతున్న అవిశ్వాసాన్ని మాటేమిటి? అధికారం ఆయన గుప్పెట్లో వుంది కాబట్టి బహిరంగంగా అసంతృప్తిని వెళ్ల గక్కడానికి చాలామంది ఎమ్మెల్యేలు భయపడ్తున్నారు. మరికొంతమందైతే పార్టీకి నష్టం జరుగుతుందని వేచి చూస్తున్నారు. ఒక వేళ పార్టీలోనే ఎవరైనా అవిశ్వాస తీర్మానం పెట్టగలిగితే ముఖ్యమంత్రి నెగ్గుక రావడం కష్టమే కావచ్చు. అది ఊహాజనితమే అయినప్పటికీ కోట్ల వారి పరిస్థితి అలాగే వుంది. ఏడాదిన్నర క్రితం అధికార పీఠాన్ని అధిష్ఠించినప్పుడు కోట్ల వారి కోట ఎంత పటిష్టంగా, శత్రు దుర్భేద్యంగా వుందో ఈ రోజు అంతగా బీటలు వారి కూలి పోవడానికి సిద్ధంగా వుంది. అధిష్టానం దేవుడు అనుగ్రహిస్తే అసంతృప్తి బద్దలైతే ఆ కోట క్షణంలో కూలడం ఖాయం. అయితే అది జరుగుతుందా? సాధారణ ఎన్నికలు మరో ఎనిమిది నెలల్లో జరగనుండగా నాలుగో కృష్ణుడ్ని తెర మీదకు తేవడానికి అధిష్టానం సిద్ధంగా వుందా? ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యేల మెదళ్లను తొలుస్తున్న ప్రశ్న ఇది. గతంలో అయిదేళ్ళలో నలుగురు ముఖ్యమంత్రుల్ని మార్చి కాంగ్రెస్ భంగపడిన చేదు అనుభవాల్ని అధిష్టానం మరచి పోగలదా? కానీ కోట్ల వారినే ముఖ్యమంత్రిగా కొనసాగిస్తే పరిస్థితి అంతకంటే దారుణంగా వుండగలదని అధిష్టానం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చిందట. నుయ్యిలో పడి ప్రాణాలు తీసుకునే కంటే గొయ్యిలో పడి దెబ్బలతో బయట పడటం మంచిదని అధిష్టానం భావిస్తోందట. ఢిల్లీకి వెళ్లి ప్రధానితో ఇక్కడి విషయాలు ఎప్పటికప్పుడు చేరవేస్తున్న కోట్ల వ్యతిరేక వర్గాలు ప్రస్తుతం పై అభిప్రాయాన్ని ప్రచారం చేస్తున్నాయి. కోట్ల వారు ఒకే కులానికి ప్రతినిధిగా వ్యవహరిస్తున్న విషయం పి.వి. బుర్రలో పెట్టడంలో కోట్ల వ్యతిరేకులు విజయం సాధించారు. ఇటీవల కోట్ల వారి తరఫున రాయబారానికి వెళ్లిన మంత్రుల బృందంతో కూడా పి.వి. ఈ విషయమై అసంతృప్తి వెళ్లగక్కారట. రాష్ట్రంలో కోట్లతో వున్న వారెవరో నాలుగు పేర్లు చెప్పండి చూద్దాం అని పి.వి. నిలదీస్తే మంత్రులు బిక్కమొహం వేయాల్సి వచ్చిందని అంటున్నారు. జనార్ధన రెడ్డి, శివశంకర్, జలగం వెంగళ రావు, ముద్రగడ పద్మనాభం, వై.ఎస్. రాజశేఖర రెడ్డి, కె.ఇ.కృష్ణమూర్తి, వెంకట స్వామి ప్రభృతులు, పలువురు ఎంపిలు ముఖ్యమంత్రిని తీవ్రంగా

కొరవ 11 పేజీలో



రత్నం
కోచింగ్ సెంటర్
14/46 A, హరనాథపురం, నెల్లూరు-524 003.
ఫోన్స్ : 25473 & 23602

EAMCET 1994 షార్ట్‌టర్మ్ బ్యాచ్ 8.4.94 న ప్రారంభం

* ఇంగ్లీషు / తెలుగు మీడియంలలో అత్యుత్తమ శిక్షణ.
* విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా హాస్టలు వసతి
* డే స్కాలర్సుకు కూడా శిక్షణ ఇవ్వబడును.

హాస్టలు విద్యార్థులకు ఫీజు రూ. 5,500/-

డే స్కాలర్స్‌కు ఫీజు రూ. 2,500/-

శిక్షణ కాలం 70 రోజులు

రూ. 1,000/- లు డి.డి. లేదా ఎం.ఒ. డైరెక్టర్‌కు పంపి సీటు రిజర్వు చేసుకోండి.

కె. పద్మావతీ రత్నం, డైరెక్టర్

ISSUE OPENS ON 4TH APRIL. 1994

RS. 5 ON APPLICATION

100% EOU

Public issue of 1,00,00,000 equity shares of Rs. 10 each for cash at par aggregating Rs. 1000 lakhs.

ISSUE HIGHLIGHTS

1. Existing profit making company-declared 15% dividend for the year 1992-93 (Profit Rs. 51.56 lakhs and equity of Rs. 283.00 lakhs).
2. 100% Export Oriented fully Integrated Aquaculture Project consisting of Hatchery, Farm, Feed Mill and Processing Plant.
3. Shrimp farm already under operation and bagged Best performance Award for 1991-92.
4. The first Indo-Taiwanese Joint venture in aquaculture with a comprehensive collaboration covering Technical knowhow, Investment of 17.5% in equity by Nan Rong Group of Taiwan.
5. Performance guarantee by Nan Rong Group of Taiwan.
6. 100% buy back arrangement for entire production with Nan Rong Group of Taiwan.
7. Capacity to develop satellite shrimp farm by providing technical knowhow, feed stock inputs and processing.
8. Promoted by Mr. S. Prasad Reddy with a decade of experience in marine industry.
9. Project appraised by IFCI and participation by IFCI/IDBI/ICICI/IRBI in term Loan of Rs. 25.80 crores.
10. Equity participation by MPEDA.
11. Low Break even point.
12. Exports Profit totally exempt from Income Tax under section 10B and 80HHC of Income Tax Act 1961.
13. Section 80 L and 80 M benefits of Income Tax Act and Wealth Tax benefits.
14. Easy liquidity listing at Hyderabad and Bombay Stock Exchanges.

INVESTORS MAY NOTE THAT IN CASE OF OVERSUBSCRIPTION, THE ALLOTMENT SHALL BE ON A PROPORTIONATE BASIS AND A SEBI NOMINATED PUBLIC REPRESENTATIVE SHALL BE ASSOCIATED IN THE PROCESS OF FINALISATION OF BASIS OF ALLOTMENT.

RISK FACTORS

EXTERNAL

The company's activities are related to Farm and Hatchery operations and are subject to natural calamities. This may result in low productivity and longer harvest periods which could adversely affect the performance of the company.

The international prices of shrimps are subject to fluctuations depending on demand/supply.

Shrimps, being live stock are exposed to the risk of disease.

Any adverse fluctuation in the exchange rate of rupee may adversely effec the profitability projections.

INTERNAL

Total required power connection is yet to be obtained.

The company is yet to obtain sanctions for enhanced working capital limits.

The company is yet to obtain permission from pollution control board.

Any delay in implementation of the project may effect the financial projections.



MANAGEMENT PERCEPTIONS OF RISK FACTORS

EXTERNAL

The site location has been designed to take care of this and till date the company's crops have not been affected by natural calamities.

The company has already exported its products to Japan and the company proposes to maximise realisations by offering the products that could fetch the best prices to the market.

In view of scientific pond management and disease control methods being employed, the company does not envisage any problem with regard to disease.

INTERNAL

The company has already filed its application for total power requirement with APSEB. The company does not foresee any difficulty in obtaining the power sanction. The company already has 75 kva power connection and 690 kva generator stand by for existing operations.

The company already submitted application to Bank of Baroda for the enhancement of limits. The company does not foresee any difficulty in obtaining sanction on enhanced working capital.

The company has already submitted application to the Pollution Control Board. The company doesn't foresee any difficulty in obtaining the permissions from the pollution control board.

SHARAT SEAFOODS LIMITED

REGISTERED OFFICE : 207, Lingapur Building Amrutha Estate, Himayat Nagar, Hyderabad - 500 029.

LEAD MANAGERS

INDUSTRIAL FINANCE CORPORATION OF INDIA LIMITED
No. 16, Sansad Marg
Bank of Baroda Building
New Delhi-110 001

BANK OF BARODA
Merchant Banking Dept
90,
C.P. Ramaswamy Road
Alwarpet
Madras - 18

REGISTRARS

AARTHI CONSULTANTS PVT LTD
1-2-285, Domalguda
Hyderabad - 500 029.

ADVISORS

ITC CLASSIC FINANCE LTD
31, Sarojini Devi Road,
Secunderabad - 500 003.

CO-MANAGERS

INDBANK MERCHANT BANKING DIVISION
3-6-237, Lingapur House
Himayat Nagar Hyderabad - 500 029.

PRUDENTIAL CAPITAL MARKETS LTD
6-3-1110, 26 & 27
Amruthamal
Somajiguda, Hyderabad - 500 016.

ఇంకా కుంటి సాకులేనా

పంచాయతీ, మునిసిపాలిటీల చట్టాన్ని సవరిస్తూ ప్రతిపాదించిన బిల్లులు శాసనసభ ఆమోదం పొందాయి. కేవలం రాజకీయ ప్రయోజనాల లక్ష్యంతో విజయ భాస్కరరెడ్డి ప్రభుత్వం మొదట ప్రవేశపెట్టిన బిల్లులోని లోపాలను కొన్నింటినైనా సెలక్ట్ కమిటీ సిఫార్సుల రూపంలో సరిదిద్ది నందుకు సంతోషించాలి.

కొత్త చట్టం ప్రకారం పంచాయితీలు, మునిసిపాలిటీలకు ఐదేళ్లకొకసారి ఖచ్చితంగా ఎన్నికలు జరిపి తీరాలి. గ్రామ స్థాయిలో సర్పంచ్ ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరుగుతుంది. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు మాత్రం పరోక్ష పద్ధతిలో జరుగుతాయి. ఈ రెండు సంస్థల ఛైర్మెన్లను ప్రాదేశిక నియోజక వర్గాల ప్రతినిధులు ఎన్నుకొంటారు. సర్పంచ్‌లకు మండలంలో, మండలాధ్యక్షులకు జిల్లా పరిషత్‌లో సభ్యత్వం వుంటుంది కాని ఓటు హక్కు వుండదు. మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గ ప్రతినిధులకు ఓటు హక్కు వుంటుంది కాని, ప్రజలతో, ప్రజా ప్రయోజనకర కార్యక్రమాలతో, నిధులతో సంబంధం వుండదు. ఏ లక్ష్యాన్ని ఉద్దేశించి, ఏ ప్రయోజనం ఆశించి ప్రాదేశిక నియోజక వర్గ ప్రతినిధుల పద్ధతిని ప్రవేశ పెట్టారో గాని, దానివల్ల పంచాయితీల వ్యవస్థే గందరగోళంలో పడిపోతున్నది. ఎవరు తమకు నిజమైన ప్రతినిధులో, తమ సమస్యలు ఎవరికి నివేదించాలో అర్థం కాక ప్రజలు అయోమయంలో పడిపోతారు. అధికారులపై అజమాయిషీ, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ ఎవరి బాధ్యతలో కూడా అర్థం కావడం లేదు.

పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించాలన్నది మరొక ప్రధాన సవరణ. పార్టీల గుర్తులు, జెండాలు, టికెట్లు వుండకపోవడం తప్ప, పార్టీ యంత్రాంగాలన్నీ వెనుక నుంచి ఎన్నికల తంతును కైవసం చేసుకోవడం తప్పదు. అయితే పంచాయితీల పై నేరుగా రాజకీయ పార్టీల రంగు పులమక పోవడం గ్రుడ్డిలో మెల్లగా భావించాలి. గ్రామ పంచాయితీలలో ఇద్దరు సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేసే పద్ధతికి స్వస్తి చెప్పి విజ్ఞత ప్రదర్శించారు. ఎన్నికైన వార్డు మెంబర్ల సంఖ్యను తారుమారు చేసి దొడ్డిదారిలో అధికారాన్ని గుంజుకోవడానికి పాలక పక్ష కుట్రపన్నుతున్నదన్న నిందను తొలగించడం సంతోషదాయకం.

పరోక్ష పద్ధతిలో ఎన్నికల వల్ల ఎన్నికల సమయంలో ఓట్ల కొనుగోళ్లు, కిడ్నాప్‌లు, క్యాంప్‌ల నిర్వహణ, ప్రలోభాల వంటి నకల సబ్బండ అవినీతి దుర్లక్షణాలూ తెరపైకి రావడంతో పాటు, మండల, జిల్లా పరిషత్ ఛైర్మెన్ పదవులకు స్థిరత్వం లోపిస్తుంది. అవిశ్వాస తీర్మానం పెడదతో, అధ్యక్షులు అనుక్షణం పదవీ గండ భయంతో పరిపాలన చేయవలసి వస్తుంది.

రిజర్వేషన్‌ల సంఖ్యను విపరీతంగా పెంచి పారేశారు. బిసీలకు 33 శాతం, హరిజనులకు 18 శాతం, గిరిజనులకు 8 శాతం - వెరసి 59 శాతం పదవులు రిజర్వు అవుతాయి. మొత్తం పదవులలో మర్లి 3 వంతు మహిళలకు అన్నారు కాబట్టి, నికరంగా ఇతర కులాల నాయకులకు లభించే పదవుల శాతం కేవలం - 27.40 మాత్రమే. దీనివల్ల పంచాయితీల పట్ల గ్రామ స్థాయి నాయకులలో నిర్లిప్తత ఏర్పడే ప్రమాదం వుంది.

ప్రతి ఐదేళ్ల కొక పారి స్థానిక సంస్థలకు విధిగా ఎన్నికలు జరుగుతాయన్న శుభవార్త తప్ప కొత్త పంచాయితీలు, మునిసిపాలిటీల చట్టంలో సంతోషించ దగిన అంశాలేవీ లేవు. బిల్లు చట్టంగా మారిన తర్వాత కూడా, రాష్ట్ర ప్రభుత్వం పీటి ఎన్నికల వాయిదాకు కుంటి సాకులు వెతుకుతూనే వుంది. ఓటర్ల జాబితా సవరణకు తగిన వ్యవధి లేదు కాబట్టి ఇప్పట్లో ఎన్నికలు జరపమని ప్రకటించారు. జాబితా సవరణ జరిగేటప్పటికి అసెంబ్లి ఎన్నికలు దగ్గర పడతాయి. అందువల్ల మర్లి వాయిదాయే. కనీసం తొమ్మిది నెలల కివతల పంచాయితీల ఎన్నికలు జరిగే అవకాశం కన్పించడం లేదు. స్థానిక సంస్థలకు రాజ్యాంగ రక్షణ కల్పించాలనే రాజీవ్‌గాంధీ మహత్తర ఆశయాన్ని ప్రధాని శ్రీ పివి నెరవేర్చినా, వాటికి పట్టిన గ్రహణం తొలగక పోవడం శోచనీయం.

ఎన్నికల విషయంలోనే కాదు, పంచాయితీల అధికారాల విషయంలోనూ సూతన చట్టంలో స్పష్టమైన నిర్వచనం ఇవ్వలేదు. జిల్లా స్థాయిలో డిడిఓ, మండల స్థాయిలో ఎండిఓ లపై జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు పూర్తిస్థాయి పర్యవేక్షణ అధికారం లేదు. వారి నియామకాలు, బదలీలు ప్రభుత్వం చేతిలోనే వున్నాయి. ఇళ్ల నిర్మాణం, రోజ్‌గార్, ఉపాధి హామి పథకం వంటి కార్యక్రమాలన్నీ కలెక్టర్ల పరిధిలోనే వుంటాయి. అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం ఇచ్చే ఇటువంటి ప్రత్యేక నిధులు తప్ప పంచాయితీలకు స్వయం జనిత వనరులు లేవు. అభివృద్ధి చేసుకోవడానికి అవకాశమూ ఇవ్వలేదు. నిధులన్నీ అధికారుల చేతిలో పెట్టి, పదవి మాత్రం అనధికారుల కివ్వడం వల్ల ప్రజలకు కల్గే ప్రయోజనం ఏమీ లేదు. గ్రామ స్థాయిలో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమం పైన నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ, పర్యవేక్షణ హక్కు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఇస్తేనే పంచాయితీల వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది.

జమీందారైతు

దళితులలో ఎంత మందికి చిత్తశుద్ధి వుంది?

బ్రిటిష వారి కుతంత్రాలకు విరుద్ధంగా జాతిపిత మహాత్మాగాంధీ సరుద్దేశంతో చేసిన పనుల గూర్చి శ్రీ బెజవాడ గోపాల రెడ్డి చెప్పిన మాటలను సణుగుడులో ఈతరం వారికి తెలియజేయడం సంతోషకరమైన విషయం. బహుజన సమాజ్ పార్టీ నాయకురాలు మాయావతి గాంధీగారు హరిజనులకు ఎటువంటి మేలు చేయక పోగా వర్ణ వ్యవస్థ నిర్మూలనకు అడ్డు తగిలారంటూ, అంబేద్కర్‌ను సమంగా చూడలేదని విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ రోజుల్లో దళితులకు ఆయన చేసిన కృషిని విస్మరించడం యీరు దాటి తెప్ప తగలేసిన చందంగా వుంది. బి.యస్.పి నాయకురాలు జాతిపిత పై ఈ విధమైన నిందా పూర్వక ప్రచారం చేస్తుంటే అటు ధిల్లీ పెద్దలు గాని, ఇటు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వంలోని వారు గాని నోరు విప్పక పోవడం జాతిపిత పై వారికున్న గౌరవాన్ని సూచిస్తుంది. ఇకపోతే దళితులమని చెప్పుకునే వారెంత మంది చిత్తశుద్ధితో తమలోని అసమానతను, అంటరానితనాన్ని రూపుమాపెందుకు ముందుకు వస్తున్నారు? తమ అంతస్తు పెరగడం తోనే అట్టరుగున వున్న తమ వారితో అన్ని సంబంధాలు తెంచుకోవడం, కించపరచడం ఎన్నోదగ్గర చూస్తున్నాం. అగ్రవర్ణాల వారితో వివాహ సంబంధాలు పెట్టుకోవడమే సంఘ సంస్కరణ అవుతుందా? అంబేద్కర్ గారు చివరి వరకు తన మతం మార్చుకోకుండా, అగ్రవర్ణ కుటుంబీకురాలిని వివాహ మాడకుండా దళితులలోనే ఒకడిగా వుండి వుంటే ఆయన అందరికీ ఆరాధ్య దైవమయ్యే వాడేమో!

క్రిచ్చిన్ -ఎన్. రామచంద్రా రెడ్డి

జనవాణి

రాయలసీమా- రక్తదాహార్తి సీమా?

ఒకప్పుడు రాయ లేలిన రతనాల సీమ ఇప్పుడు రక్త దాహార్తి సీమగా మారిపోయింది. నిరంతరం హత్యలు, దొమ్మీలు, గృహదహనాల వార్తలు వింటుంటే హృదయం ద్రవించి పోతోంది. పేరు ప్రతిష్టలు, రాజకీయ స్పర్ధల కోసం మానవత్వాన్నే మంటగలుపుతున్నారు అక్కడి నేతలు. అంగరక్షకులు, కత్తులు, చాకులు, తుపాకులు లేకుండా ప్రజల్లోకి వచ్చి మాట్లాడే ఒక్క నాయకుడైనా అక్కడ వున్నారా? రాయలసీమ ప్రభుత్వ ఏలుబడిలో వున్నా రాక్షసత్వానిదే పై చెయి అవుతున్నది. ఈ క్షుద్ర సంస్కృతిని ధ్వంసం చేసే వారే లేరా?

కోవూరు -ఎస్. హనుమంతరావు

సెన్సార్ బోర్డు వింత ధోరణులు

ఇటివల యువదర్శకుడు రామ్‌గోపాల్ వర్మ సెన్సార్ బోర్డు పై పలు విమర్శలు ఎక్కుపెట్టి సంచలనం సృష్టించారు. బోర్డు ధోరణి మారే వరకు చిత్రాలు తీయనని అలకపూనారు. ఈ నేపథ్యంలో పలువురు సినిమా ప్రముఖులు, పెద్దలు ఈ దర్శకుడిని సమర్థిస్తూ మాట్లాడారు. కాని ఇప్పుడొస్తున్న సినిమాలు చూస్తుంటే నిర్మాత, దర్శకులతో పాటు సెన్సార్ అధికారుల తీరును కూడా విమర్శించాలి. వర్మ చిత్రాలనే తీసుకుందాం. శివ చిత్రంలో విపరీతమైన హింస, రాత్రిలో దయ్యాల పై అభూత కల్పన. అంతం, గాయం చిత్రాలలో మర్లి హింస చూపాయి. క్షణక్షణం, దొంగ దొంగ చిత్రాల్లో

కొరవ 10 పేజీలో


31. 3. 1944

పేజీలు 8, వెల 0-1-6

పల్లెటూళ్లు

పల్లెల్లో రూపాయినోటు

నలిగివుంటే చెల్లని పామ్యంగా అంటున్నారు. లెక్కలేని చేతులు మారేటప్పుడు. మరి కొట్లలు మోసేవాని బొడ్లో- పేరేసి ఆమె పైట కొంగున, పంకాయలమ్మే ఆయన పక్కాకు మూటలో- ఓయబ్బో! ఒక దినం పరుచుంది ఓపిక పట్టివించే నా బ్రతుకు, ఎన్నిచేతులో మారుతాను దీనికి. ఇలాంటప్పుడు నేను మాసిపోయాను, నలిగిపోయాను, మరకలయ్యాను, ముద్దరలు పడ్డాను- మారనంటే - నేనేమిజేసేది? ఎవరితో చెప్పుకునేది? ఒక్కరు నన్ను మార్చుకోవాలంటే ఆ నెపం యీ నెపంజెప్పి అణా, అర్ధణాగూడ గుంజేస్తున్నారు.



కావున నే జెప్పేదేందంటే !నన్ను మార్చు కునేందుకు లంచ మియ్యొద్దు. నేనెట్లా మారిపోతాను. ఒకరి దగ్గరనిల్చేదాన్నీగారు. నాకా నిలకడలేదు. అందరూ నన్ను మంచి మనసుతో అనుభవించండి.

-రూపాయినోటు.

కావలి సినిమా కాలధర్మం

కావలి సినిమా మిషను- ప్రొజెక్టరును ఉగాదినాడు అమ్మేసి- సినిమాను నిలిపేశారు.

లాయర్లు, డాక్టర్లు, రెడ్లు, కళాపోషకులు, రాపుసాహెబులు, వర్తకులు వగైరా తలా మారు రూపాయల భాగ్యంతో కొనా మొదటికి లాభమొర నడిపించే ఘనాఘన పురుషులుండి గూడా సినిమా లేకుండా చేశారంటే - ఇంట్లో దీపమార్పేసినారన్న మాట.

-పిరుదు.

50 ఎళ్ళ క్రితం ఈవారం

గుండెమడకల బడయ్యారు

బడయ్యవారు తత్వజ్ఞానేపదేశంతో పూరి వ్యవహారాల్లో కొరవడి పార్టీలుపెంచి గందరగోళం కిస్తున్నారు.

ఈ చదువు మాకులేకుంటే మనె- యీ పీడను యింకెక్కడికన్నా దొబ్బె చాలు జిల్లాబోర్డువారు.

పెదారికట్ల పసుపుకుంకం

పెదారికట్లలో ఈ మధ్య 10 ఏరులు 20 రవికెల పసుపుకుంకంతో లేచింది ఒక స్త్రీ- అవ్వా! -తట్ట.

జమీందారీ జవాన్లకు గుమాస్తాలకు సెప్టెంబరు నుండి బత్తలు యింకా యీలేదే- కరువులో గూడా యీ విదానమంది స్వామి?

-ఒక భక్తురు.

కొరవ 10 పేజీలో

కాశ్మీర్ ముమ్మాటికీ మనదే-కాదంటే దేశ ద్రోహమే!

కాశ్మీర్ సమస్య-దేశ సమగ్రత అనే అంశం పై 26 తేది టౌన్ హాల్‌లో అన్ని పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సెమినార్ ఏకాభి ప్రాయాన్ని ప్రతిబింబించలేక పోయింది. వివిధ పార్టీనాయకులు పార్టీ అగ్రనాయకులు వల్లిస్తున్న మాటలనే మళ్లీ చెప్పారు. అయితే సభలో పాల్గొన్న వారంతా కాశ్మీర్ మనదేనని మాత్రం నొక్కిచెప్పి బ్రతికించారు. న్యాయవాది ఆర్. సత్యనారాయణ, విజయా గ్రాఫిక్స్ ప్రసాద్ ఈ కార్యక్రమం ఏర్పాటు చేసారు. నెల్లూరు ఎమ్మెల్యే జె.కె. రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. కాశ్మీర్ ఎవరిదో కాదు, దేశ ప్రజలందరిది; దాన్ని కాపాడు కోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా వుందన్నారు. అమెరికా భారత దేశాన్ని తన గుప్పెట్లో పెట్టుకొనేందుకు పాకిస్తాన్‌ను మన పై వుసిగొల్పుతూంది; సిమ్లా ఒప్పందాన్ని తిరగతోడి పాకిస్తాన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారాయన. కాశ్మీర్ విషయంలో ఎలాంటి అపోహలు, అనర్థాలకు చోటివ్వకుండా దేశ సమగ్రత, సమైక్యతను రక్షిస్తామని ప్రతిఒక్కరూ ప్రతిన బూనాలని జె.కె. కోరారు.

పాలకుల బలహీనతే కాశ్మీర్ సమస్యకు కారణమని తెలుగుదేశం నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి అభిప్రాయ పడ్డారు. కొన్ని వందల మంది మిలిటెంట్లు వేలాది మంది ప్రజల ప్రాణాలు బలిగొంటూంటే నివారించలేక పోవడం దారుణ మన్నారాయన. భారతీయ జనతా పార్టీ

నెల్లూరు సంగతులు

అధ్యక్షుడు డాక్టర్ వరదయ్య మాట్లాడుతూ ప్రస్తుతం కాశ్మీర్ భారతదేశం చేతుల్లో లేదని మిలిటెంట్ల చెప్పు చేతుల్లో వుందని, గతంలో పాలకులు చేసిన తప్పుల వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైందన్నారు. శ్రీనగర్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసే పరిస్థితులు లేవని, ఒకవేళ ఎవరైనా ముందుకు వస్తే మన పాలకులువారిని అరెస్ట్ చేయిస్తున్నారని దుయ్యబట్టారు. కాశ్మీర్‌ను కబళించాలన్న యోచన పాకిస్తాన్‌ది కాదని దీని వెనుక అమెరికా కుటిల హస్తముందని యుసిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఎల్. నారాయణ రావు చెప్పారు. కాశ్మీర్ సమస్యను గోరంతను కొండంతలు చేసి మన దేశాన్ని అస్థిరత్వం పాలు చేయడానికి అమెరికా కుట్ర పన్నుతుందని ఆరోపించారు. సిపిఐ జిల్లా సమితి అధ్యక్షుడు పి. వేదాచలం, ఎన్. సిరాజ్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ సేతురామిరెడ్డి తదితరులుప్రసంగించారు. కాశ్మీర్ వంటి సంక్లిష్ట జాతీయ సమస్యపై కూలంకషంగా చర్చ జరిపించి సామాన్యులకు కూడా సమస్య తీవ్రత అర్థమయ్యేట్లు చేసిన నిర్వాహకులు అభినందనీయులు.

వయసు మళ్లిన పోలీసు ప్రతిభ!

డ్యూటీతో పాటు ఆటల్లోనూ ప్రతిభ చూపించాల్సిన కుర్ర పోలీసులు చతికిల బడిపోయినా, వయసు మళ్లిన పోలీసులు మాత్రం ఆటల్లో మంచి ప్రతిభ చూపి నెల్లూరు పేరు నిలబెట్టారు. 18, 19 తేదీల్లో విశాఖ పట్నంలో జరిగిన స్టేట్‌లెవల్ అథ్లెటిక్ మీట్‌లో 18 మందిపోలీసులు పాల్గొని 55 పతకాలతో తిరిగి వచ్చారు. వీరికి ఎఆర్ డి.ఎస్.పి. గోవింద రాజులు టీమ్ మేనేజర్‌గా

కొరవ 11 పేజీలో

సణుగుడు

* మా మంచి బాలుడు సివి!
* కులం పిచ్చి మరీ ముదిరి పోతూంది!
* న్యాయ వ్యవస్థకూ మురికి పట్టిందా?

రాముడు మంచి బాలుడన్నట్లు సివి శేషారెడ్డి కూడా మంచి శాసన సభ్యుడై పోయాడు. అయ్యవారిని తలుచుకుంటేనే జడుసుకొని, నిక్కరు తడుపుకొనే బడిపిల్లవాడి వలె ఈ నాలుగేళ్లలో ఒక్క నాగా పెట్టకుండా, అసెంబ్లీలో అటెండెన్సు వేసుకొని, ఫస్ట్ ప్రైజ్ కొట్టేశాడు. శాసనసభ హాజరులో తన జీవిత కాలమంతా క్రమం తప్పని వాడుగా గౌరవం పొందిన నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి లేని కొరతను శేషారెడ్డి తీర్చడం నెల్లూరుకు ఘనతే!

అసెంబ్లీ అటెండెన్సులోనే కాదు - నియోజక వర్గంలోని గ్రామాల సందర్శనలో కూడా శేషారెడ్డికే ప్రథమ బహుమతి ఇవ్వాలి. స్థాయి, అంతస్తు పెద్దవి కాబట్టి నేదురుమల్లి జనార్ధన రెడ్డి గారి రచ్చబండ సమావేశాలకు అంత ప్రచారం లభిస్తున్నది కాని, శేషారెడ్డి నిత్యం చేసేదదే! నెల్లూరులో వుంటే కనీసం రోజుకు రెండు గ్రామాలు చూడకుండా వుండలేడు; అధమ పక్షం వంద మందికి తక్కువ మాట్లాడకుండా నిద్రపోడు. ఆ ఓపిక, ఆ నేర్పరితనం అన్యులకు అసాధ్యం. హైదరాబాదులో వుంటేనన్నా సుఖంగా వుంటాడా? అబ్బే! అర్ధశేరు బఠానీలు అవలీలగా పట్టే గుడ్డ సంచి వంటి జేబు నిండా చీటీలు పెట్టుకొని రైలెక్కుతాడు. మంత్రులు, అధికారులు, అనధికారులు... ఒకరనేమిటి? ముఖపరిచయం వుంటె చాలు - తలుపు తోసుకొని వెళ్లి, ముఖ మాట పెట్టి, కాళ్లు గడ్డాలు పట్టుకొని బ్రతిమలాడి, నిష్ఠూర పడి కాగితాల పై సంతకాలు పెట్టించుకొని వచ్చేస్తాడు. పొద్దుటి నుంచి రాత్రి వరకు అదే యావ, అదే ధ్యాస. ఇప్పటి

డోలేంద్ర

ఎమ్మెల్యేలలో అంతగా చెమటోడ్చే వారు, జనంతో కలిసి పోయే వారు జనం కోసం సమయం వెచ్చించేవారుచే ఎందరున్నారు చెప్పండి? 78 లో శేషారెడ్డికి, 89 శేషారెడ్డికి ఎంతో మార్పు. అనాటి ప్రవర్తనకు శిక్ష అనుభవించాడు; ఈనాటి పరిణతికి పారితోషికం పొందుతాడో లేదో పది నెలల్లో తేలిపోతుంది!

శేషారెడ్డి ఎంతటి మంచి శాసన సభ్యుడో, అంతే మంచి ఆసన

కొరవ 7 పేజీలో

ఉత్తరక్రియలు

మా తండ్రి



వేమిరెడ్డి శేషారెడ్డిగారు

22-3-94 తేది మంగళవారం స్వర్గస్తులైనారు.

పెద్దకర్మ 7-4-94 తేది గురువారం ఉదయం 9-00గంటలకు

నెల్లూరు ఆచారి వీధి, (అనిత థియేటరు వెనుక)

మొగళపల్లి సత్రమునందు జరుగును. కావున

తెలుపడమైనది.

ఇట్లు,

కుమారులు : వేమిరెడ్డి గోపాలరెడ్డి, జనార్దనరెడ్డి, ,
శ్రీనివాసుల రెడ్డి వేమిరెడ్డి నందకుమార్‌రెడ్డి
కుమార్తె : యేలూరు బుజ్జమ్మ (అరుణ)
అల్లుడు : యేలూరుశ్రీనివాసులరెడ్డి
డివిజినల్ ఇంజనీరు APSEB
మనరాళ్లు : డా. అనిత USA కవిత (MSc.)

వారు విమానాల్లో ఆకాశంపైకి ఎగిరితే మనవారు పరాకాశంలో విహరిస్తారు!

16 తేదీ స్వర్గీయ తిక్కవరపు రామిరెడ్డి 103వ జయంతి సభను టౌన్‌హాల్‌లో సాహిత్య సదస్సు నిర్వహించింది. ఈ సభకో ప్రత్యేకత వుంది. శ్రీ రామిరెడ్డి జయంతి అవార్డును అలవాటు ప్రకారం సాహితీ వేత్తలకు కాకుండా, ఈసారి వాషింగ్టన్‌లో పేరున్న రసాయనిక శాస్త్రవేత్త డాక్టర్ కొట్రా వి.కృష్ణమూర్తికి ఇచ్చారు. "ఆలోచన, వాస్తవం, సృజనాశక్తి" అనే అంశంపై కృష్ణమూర్తిగారి ఆంగ్ల ప్రసంగం ఆహూతులలో పలువురికి అర్థం కాకపోయినా, విషయ వివరణ ఆకట్టుకొనే రీతిలో వుండింది. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి సభకు అధ్యక్షత వహించి తిక్కవరపు రామిరెడ్డి దానశీలతను ప్రస్తుతిస్తూ అపర భోజునిగా అభివర్ణించారు.

ముఖ్య అతిథి డాక్టర్ కొట్రా కృష్ణమూర్తి మాట్లాడుతూ మనస్సులో రూపొందిన ఆలోచనను గుడ్డిగా అనుసరించడం మనుష్యులలోని వ్యాలోల మతికి కూడా తప్పని నియమ బద్ధ స్థితిని కల్పిస్తుంది. మానవ చరిత్రలో అటువంటి అనుయాయుల స్వానుభవాల ఉజ్జ్వలోదాహరణ లున్నాయని వీరినే ఐడియాలజిస్టులంటారన్నారు. ఐడియాలజిస్టులు కళాకారులైతే సృజనాత్మక ప్రయోగాలు చేయగలరని చెప్పారాయన. భౌతిక విజ్ఞానంలోని మూడు రకాల లక్ష్యాలైన ఆదర్శ ప్రాయాలు, వాస్తవ రూపాలు, ఉపయోగార్థాల నమూనాలు మానవుని సృజనా శక్తి ఫలాలని నిర్వచించారు. ఆదర్శం వ్యక్తికి కేవలం మానసికం;

రామిరెడ్డి జయంతి సభలో అమెరికా రసాయన శాస్త్రవేత్త విజ్ఞానదాయక ప్రసంగం

వాస్తవ రూపం భౌతిక ప్రపంచంలో సృజనా కార్యం, సృజనా శక్తి అటు మానసికం, భౌతికమని కూడా చెప్పారు.

రసాయనిక శాస్త్ర విశ్లేషణలోని గుణ నియంత్రణ సూత్రార్థ్యయాన్ని సవివరంగా వివరించారు. ప్రాచీన కాలంలో జీవితానికి ఒరవడి లేదు. ఆ రోజుల్లో మానవుడు గతాన్ని గౌరవించి ప్రస్తుతాన్ని తృణీకరించేవాడు. ప్రస్తుత స్పీడ్ యుగంలో గతం మీద గౌరవం తగ్గి వర్తమానంపై గురి ఏర్పడిందన్నారు. కళాకారుల సృజనాత్మక పరివర్తనంలో ఆదర్శ స్థాపనకు వాస్తవ నిరూపణ వుదాహరణగా తాజ్‌మహల్‌ను పేర్కొన్నారు. షాజహాను ప్రేమ అనే ఆదర్శం, ఒక శిల్పి సృజనాత్మక శక్తి వల్ల ఒక మనోహరమైన సౌధ రూపంలో వాస్తవత్వం పొంది వెన్నెలలో తాజ్‌మహల్ అనే రసానుభూతిని కలిగిస్తున్నదనీ ఇదే ఆదర్శ, సృజనా, వాస్తవముల ఏకీకరణ అన్నారాయన. చివరలో ఒక పద్యం చెబుతూ పాశ్చాత్యులు విమానాలు నిర్మించి ఆకాశంలో ప్రయాణం చేస్తె మన దేశంలో పరాకాశంలో విహరించే ఆధ్యాత్మికు లున్నారని చెప్పి ముగించారు.

అనంతరం డాక్టర్ కొట్రా కృష్ణమూర్తి గారికి వర్ధమాన సమాజం, రోటరీ క్లబ్, పినాకినీ విద్యాపీఠాలువిడివిడిగా సత్కరించాయి. కొమండూరి శేషాద్రి బృందం వయోలిన్ కచ్చేరి ఆహూతులను పుత్తేజపరిచింది. సభకు జె.వి.రెడ్డి స్వాగతం చెప్పగా సాహిత్య సదస్సు కార్యదర్శి గోసుకొండ వెంకట సుబ్బయ్య వందనాలు చెప్పారు.

జిల్లా వార్తలు

జిల్లా వార్తలు

జిల్లా వార్తలు

అడిగేవాడు లేక అందరికీ అలుసే

కావలి డివిజన్‌లో ఉత్తమ పంచాయతీలు

కావలి డివిజన్ పరిధిలోని 18 మండలాల్లో మండలానికి ఒకటి చొప్పున ఉత్తమ పంచాయతీలను ఈ సంవత్సరం ఎంపిక చేసినట్లు ఆర్డీవో పి.రాజరత్నం తెలిపారు. వ్యవసాయాభివృద్ధి, స్త్రీ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ, పారిశుద్ధ్యం, బలహీన వర్గాల అభివృద్ధికి చేపట్టిన పనులు, పన్నుల వసూళ్లు మొదలైన అంశాలను పరిగణలోనికి తీసుకొని ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేశారు. కావలి మండలంలో మన్నూరుపాడు, జలదంకిలో గట్టుపల్లి, కలిగిరిలో లక్ష్మీపురం, కొండాపురంలో గుడవల్లూరు, వింజమూరులో చాకలి కొండ, దుత్తలూరు, వరికుంటపాడులో పెద్దిరెడ్డిపల్లి, ఎన్.ఆర్.పురంలో శింగారెడ్డిపల్లి, ఉదయగిరి, మర్రిపాడులో ధర్మారావు చెర్వుపల్లి వున్నాయి. ఇవేగాక బోగోలులో అనంత బొట్లవారి కండ్రిగ, అల్లూరులో నార్తు మోపూరు, బుచ్చిరెడ్డి పాళెంలో పంచేడు, సంగంలో పడుగుపాడు, కొరవలూరు, విడవలూరులను ఉత్తమ పంచాయతీలుగా గుర్తించారు.

అన్నారెడ్డిపాళెం రైతుల ఆనందం

దువ్వూరు బ్రాంచి ఛానల్ క్రింద 3487ఎకరాల్లో రెండవ పంట వేసుకొనేందుకు అనుమతి మంజూరయ్యింది. ఇంతవరకూ ఈ ఛానల్ క్రింద రెండవ పంటకు అనుమతి ఇచ్చిన వారెవరూ లేరట. పై అధికారులను ఒప్పించి తమకు నీరు ఇప్పించిన ఇఛకో చైర్మన్ వెళ్లకూరు రామచంద్రారెడ్డికి, చేవూరు దేవకుమార్ రెడ్డికి కృతజ్ఞత చెబుతున్నారు అన్నారెడ్డిపాళెం, దువ్వూరు బ్రాంచి ఛానల్ రైతులు.

బూదనం నిమ్మ రైతుకు బహుమతి

గూడూరులో ఇటీవల జరిగిన డివిజన్ వ్యవసాయ ఫల ప్రదర్శనలో బూదనం రైతు తాటిపర్తి రమణారెడ్డి, తోటలో పండించిన నాణ్యమైన నిమ్మకాయలు బహుమతి పొందాయి. రమణారెడ్డి ఎంత తీరిక లేకున్నా ప్రతిదినం మూరు గంటలపాటు తోటలోనే గడిపి ప్రతి కొమ్మ, రెమ్మను పరిశీలించి విశిష్టమైన ఉత్పత్తికి కారకులయ్యారట. తమ గ్రామరైతు బహుమతి పొందడం పట్ల గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండా వుంది.

రెండు నెలలుగా జీతాలు లేని మార్కెట్ కమిటీ

వెంకటగిరి కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ నిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు లేకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. స్టోర్స్‌లో వున్న ఏడుమంది సాధారణ ఉద్యోగులకు జీతం చెల్లించలేని పరిస్థితి ఇంతకు ముందెన్నడూ కలుగలేదు. ఉన్నతాధికార్లు తగిన చర్యలు తీసుకోకుంటే ప్రజా పంపిణీ వ్యవస్థకు విఘాతం కలిగి ప్రజలు ఇబ్బంది పడేటట్లున్నారు.

ప్రయాణీకుల సేవలో పార్శిల్ సర్వీసులు

సకాలంలో బస్సులు నడవడంలో ఆర్టీసి విఫలమవ్వడంతో రాపూరు మండల ప్రజలు పార్శిల్ సర్వీసు వ్యాన్లను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసి బస్సులకన్నా తక్కువ ఛార్జీ వుండడం, గమ్యానికి త్వరగా చేర్చడంతో ప్రజలు వీటివైపే మొగ్గు చూపుతున్నారు. తమ లాభానికి, గండి కొడుతున్నాయని అర్థంకొన్న ఆర్టీసి అధికారులు, రవాణా శాఖాధికారులు గాని పట్టించుకోక పోవడంతో పార్శిల్ సర్వీసుల వ్యాన్లు వెలిగిపోతున్నాయి. అయినా కందకు లేని దురద కత్తిసేల నెందుకు చెప్పింది?

కలిచేడులో ఆటల పోటీలు

సైదాపురం మండలం కలిచేడు మైకా కార్మిక సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో గనులలో పనిచేసే స్త్రీ, పురుషులకు 25 తేది ఆటల పోటీలు నిర్వహించారు. కేంద్ర కార్మికశాఖ డైరెక్టర్ హెచ్.కె. నరుల పోటీల ప్రారంభ సూచకంగా తెల్ల పావురాలను ఎగుర వేయగా డిప్యూటీ కమిషనర్ రాకేష్ చంద్ర బాతియ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్మిక సంస్థ ప్రత్యేకాధికారి వి.సాంబశివరావు మాట్లాడుతూ కలిచేడు సెంట్రల్ ఆసుపత్రి నిర్వహణ ఎంతో బాగున్నదని అందువల్ల ఎక్స్‌రే ప్లాంట్, మొబైల్ వ్యాన్‌ను మంజూరు చేస్తామన్నారు. క్రీడల్లో పలువురు స్త్రీ, పురుషులు వుత్సాహంగా పాల్గొన్నారు. 27తేది జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు పి.నరసింహ కుమారరెడ్డి అధ్యక్షత వహించారు. రాఘవేంద్ర మైన్స్, సీతారామ మైన్స్, కళ్యాణరామ మైన్ కార్మికులు పలు బహుమతులు గెలుచుకున్నారు. స్నేహ

Dr. C.V. RAMAN JUNIOR COLLEGE

FOUNDATION COURSE

A Special two month preparatory course for

C.B.S.E. & I.C.S.E.

Students Seeking Admission

INTERMEDIATE COURSE
From April 4th

FOR DETAILS CONTACT OUR OFFICE AT
SARASWATHI NAGAR, NELLORE - 3.
PHONE: 28977

నెల్లూరు కబుర్లు

విశ్వామిత్రుడు

జనార్ధనరెడ్డి

రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ నేదురుమల్లి జనార్ధనరెడ్డి జిల్లాలో వున్నారు. బహుశ రేపో, ఎల్లుండో హైదరాబాదు వెళ్లవచ్చు. ప్రస్తుత మకాం వాకాడు.

మంత్రులు

దేముళ్ల మంత్రి శ్రీ కలికి యానాది రెడ్డి ఈ రోజు కావలికి వచ్చారు; సాయంత్రం హైదరాబాదు రైలెక్కుతారు. 3 తేది మళ్లీ వస్తారు. 6 తేది వరకు వుండి రాజధానికి తిరిగి వెళ్తారు.

* * *

అడవుల మంత్రి శ్రీ పసల పెంచలయ్య 31 తేది వచ్చారు. 6 తేది వరకు వుంటారు.

* * *

చక్కెర మంత్రి, జిల్లాతో ఏ సంబంధమూ పెట్టుకోని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీ పి.సాంబశివ రాజు 4 తేది నెల్లూరు వస్తారు. 5 తేది ఆత్మకూరు, 6 తేది జిల్లా సమీక్షా మండలి సమావేశం. అదే రోజు తిరుగు ప్రయాణం.

పెళ్లకూరుకు అంతర్జాతీయ అవార్డు

ఇఫ్కో చైర్మన్ పెళ్లకూరు రామచంద్రారెడ్డి గారికి ఆఫ్రికా ఖండంలోని సెనగల్ దేశం ఒక అరుదైన అవార్డును బహూకరించింది. ఫాస్ఫేటిక్ ఎరువుల ఉత్పత్తి, విస్తృత ప్రచారాల ద్వారా రైతులకు [illegible] సేవ చేసినందుకు



"[illegible] అఫ్ [illegible] అఫ్ సెనగల్" అనే అవార్డును బహూకరించారు. అంతర్జాతీయ రంగంలో వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించే వారికి ఆ దేశాధ్యక్షుడు స్వయంగా ప్రకటించే పురస్కారం ఇది. మొన్న 30 తేది ఢిల్లీలోని తాజ్ హోటల్‌లో అత్యంత విలాసవంతంగా ఏర్పాటుచేసిన సభ లో 13 దేశాల నుంచి వచ్చిన ప్రతినిధుల సమక్షంలో ఈ అవార్డు అందజేశారు. మన మంత్రులు బలరాం జక్కర్ [illegible] కూడా హాజరైనారు. రామచంద్రారెడ్డి గారు తనకు ఇఫ్కో పదవి వచ్చిన నాటి కంటే, ఎక్కువగా గర్వపడవలసిన, సంతోషించవలసిన పురస్కారం ఇది.

రామచంద్రారెడ్డిగారు ఛైర్మన్ అయిన తర్వాత ఇరాన్, కతార్ దేశాలలో 600 కోట్ల ఖర్చుతో ఇఫ్కో తరఫున రెండు ఎరువుల కర్మాగారాలు నిర్మిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీలలో ఉత్పత్తయ్యే ఎరువులను తిరిగి మన దేశానికి తెచ్చి, దక్షిణ రాష్ట్రాలలో పంపిణీ చేస్తారు. ఉత్తర ప్రదేశ్‌లో ప్రస్తుతం ఇఫ్కోకు వున్న రెండు కర్మాగారాలను 960 కోట్ల ఖర్చుతో విస్తరిస్తున్నారు.

రామచంద్రారెడ్డిగారికి మా మనఃపూర్వక అభినందనలు.

సనాతన వేదాంత సభలు

పెళ్లకూరు రామచంద్రా రెడ్డి గారి ఆధ్వర్యంలో 27 నుంచి 29 తేది వరకు నెల్లూరులో సనాతన వేదాంత జ్ఞాన సభలు ఆడంబరంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో స్వామీజీలు, అసంఖ్యాక భక్త జన సందోహంతో ఆ మూడు రోజుల పాటు కోఆపరేటివ్ బ్యాంకు ఆవరణం కళకళ లాడింది. చెప్పాలంటే చాలా వుంది; స్థలం లేదు; పై వారం చర్చించు కుందాం.

రంగడి తిరునాళ్లు వైభవంగా జరిగింది!

రంగనాయకుల పేట శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు చాలా వైభవంగా, అశేష జన సందోహంతో జరిగాయి. తేరు రోజు జనంతో వీధులు పట్టలేదు. వైభవం కోల్పోయాడన్న దుష్ప్రచారంలో వుండిన రంగనాథుడి పట్ల నెల్లూరు జిల్లాలో భక్తి, విశ్వాసాలు ఏ మాత్రం సడల లేదనడానికి రుజువు అన్నట్లు తరలి వచ్చారు జనం. ఇదొక శుభ పరిణామం.

తిరునాళ్ల ఏర్పాట్లను ధర్మకర్తల మండలి సభ్యుడు శ్రీ ఉడతా వెంకట్రావు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు శ్రీ కెవిఎస్ నరసింహాచారి పర్యవేక్షించారు.

శివాలయం సిగపట్లు

మూలపేట శివాలయానికి ధర్మకర్తల మండలి సభ్యులుగా ఏడుగురు మహిళలను నియమించవలెనని ఎమ్మెల్యే శ్రీ [illegible] సిఫార్సు [illegible] ఎ. అన్నపూర్ణమ్మ, పందిళ్లపల్లి అరుణమ్మ, రాచగిరి సులోచనమ్మ, పులిమి [illegible], పువ్వాడ సుధారాణి, తక్కెళపాడు నళిని, బోడా పార్వతి, ట్రస్టీలుగా ప్రమాణ స్వీకారం చేశారు.

ఏడు కొప్పులు ఒక చోట చేరితే ఏమి జరుగుతుంది? ఛైర్మన్ ఎన్నిక పై సిగపట్లు పట్టుకొని, [illegible] సతీమణి రాజీ మంత్రమూ విఫలమై, ఒద్దిక కుదరక ఎన్నికే వాయిదా వేసుకొని అందరూ ఇళ్లకు వెళ్లారు. పదవుల దగ్గర కొచ్చేసరికి ఆడైనా, మగైనా పేచీలు తప్పవు కదా? [illegible] ఏదైనా సర్దుబాటు చేస్తేనే ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది లేకుంటే శివుడికి ఒగపట్ల సేవే!

రాయప్రోలు జయంతి

జమీన్‌రైతు జీవప్రదాత స్వర్గీయ నెల్లూరు శ్రీరామమూర్తి గత సంవత్సరమే, తనకు చిన్న నాట చదువు నేర్పిన కవయిత్రి పెనుబల్లి జయలక్ష్మమ్మ పేరిట రాయప్రోలు సుబ్బారావు జయంతి సభ నిర్వహించాలని తలపెట్టి, తొలి సభను దగ్గరుండి జరిపించారు. దురదృష్ట వశాత్తు ఆ తర్వాత కొద్ది కాలంలోనే ఆయన్ను కోల్పోయాము. ఆయన కోరిక పైన, ఆయనే ఏర్పర్చిన నిధితో వర్ధమాన సమాజం ఆ జయంతి సభను ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నది. 10 తేది టౌన్‌హాలులో జరిగె సభలో ఆచార్య కొత్తపల్లి వీరభద్ర రావు గారు సన్మానం స్వీకరిస్తారు. డాక్టర్ బెజవాడ గోపాల రెడ్డి గారు అధ్యక్షిస్తారు. అందర్నీ ఆహ్వానిస్తున్నారు సమాజాధ్యక్షులు శ్రీ పి.వి. రమణారెడ్డి.

పట్టపగలు నడిరోడ్లో హత్య

దర్గామిట్ట కరెంటాఫీసు దగ్గర 29 తేది ఉదయం 11 గంటలకు ఒక దారుణ హత్య జరిగింది. సునీల్ కుమార్ రెడ్డి అనే భక్తవత్సల నగర్ నివాసి అక్కడ ఒక బ్రాందీ షాపుకు వెళ్లి, కొద్దిగా తీర్థం పుచ్చుకొని, మెట్లు దిగుతుండినాడట. ఈలోగా నలుగురు యువకులు ఒక ఆటోలో వచ్చి సునీల్‌ను ఒడిసి పట్టుకొని, కసి దీరా కత్తితో పొడిచి, చచ్చాడని నిర్ధారించుకొని, మళ్లీ అదే ఆటో ఎక్కి నింపాదిగా వెళ్లిపోయారు. కొన్ని వందల మంది జనం కళ్ల ముందు జరిగి పోయింది ఘోరం. హతుడి శరీరం పై 14 కత్తిపోట్లుండినాయి. నరేంద్ర అనే మరొక స్థానికుడికి, సునీల్‌కు ఒక ఇళ్ల స్థలం విషయంలో వచ్చిన పేచీయే ఇంత ఘోరానికి కారణమని తెలుస్తున్నది. నరేంద్ర అతడి మిత్రులు పచ్చా వెంకటేశ్వర్లు, కృష్ణ, జయకృష్ణ అనే నలుగురు హంతకులని పోలీసు కేసు పెట్టింది. సునీల్ ఆటో డ్రైవరు; ఆ యూనియన్‌లో కూడా ఏదో పదవి వున్నట్లుంది. చిన్న చిన్న దౌర్జన్యాలు చేసేవాడట. రౌడీగా పేరు వుందట. రౌడీయిజం పై ఆధారపడే జీవితాలు ఎప్పటికైనా ఇట్లనే అంతమౌతుంటాయి.

హత్య జరుగుతుంటే చుట్టు ప్రక్కల అంగళ్ల వారు భయపడిపోయి, హడావుడిగా షట్టర్లు దించేసి, పారిపోయారు. హంతకులను నివారించను, లేదా తరుముకొను ఒక్కరు కూడా ప్రయత్నించలేదు.

సణుగుడు

(4 పేజీ కొరవ)

జ్ఞాపకం రాదు. అవి లేకుంటే నిత్యం కుల నామస్మరణే! ముద్రగడ పద్మనాభం ఉదంతం చూడండి; వ్యక్తిగా మంచివాడు, నిజాయితీ పరుడు, నిష్కళంకుడు; కాని కులం పేరుతో రాజకీయాలు చేయడానికి వెనుకాడటం లేదు.

అన్ని పార్టీల నాయకులూ- ఢిల్లీ నుంచి గ్రామాల వరకు కులం పేరుతో సమాజాన్ని విడగొట్టి, ముక్క చెక్కలు చేసి, ఎక్కడి కక్కడ గిరులు గీసి, పరిధులు నిర్దేశించి నానా గందరగోళం సృష్టిస్తున్నారు. ఈ వైఖరి సమాజాన్నీ, మనల్నీ ఎక్కడకు తీసుకు వెళ్తుంది? ఎటై పోతున్నాం మనం ? ఎటు పోతున్నాం మనం ? ఈ కుల విష భాండాన్ని జనం నెత్తిన పెట్టి బలవంతంగా త్రాగిస్తున్న నాయకులను నిలువరించే వారెవరూ లేరా?

ఖాళీ స్థలము అమ్మబడును

నెల్లూరు చిన్నబజారు కలశ బజారులోని ఖాళీ స్థలము సుమారు 160 అంకణములు అమ్మబడును.

MD. గయాసుదీన్
2/9/16, మ్యాదరివీధి, కావలి
నెల్లూరు జిల్లా

ఫోను నంబర్లు మార్పు

ఇంటి నం. 31738
అంగడి 31426

Rtn. బొమ్మిన సుబ్రహ్మణ్యం
నెల్లూరు - 524 001.

నిర్మల వక్కపొడి
నెల్లూరు 524 002.

చేతితో తాకని శుభ్రత - చవులూరించే రుచి, స్వచ్ఛత!

చేతితో తాకకుండా, పూర్తిగా యంత్రాల సహాయంతో అధునాతన తీరులో తయారౌతున్న నిర్మల వక్కపొడి పదిపైసల పొట్లాలను రుచి చూడండి!

పెట్టుబడి రూ. 3 వేలు
సొంత వ్యాపారము స్వయంఉపాధి పథకం
నెలసరి ఆదాయము పెట్టుబడిలో 1/3వ వంతు వరకు

పార్ట్ టైం బిజినెస్ డీలర్లు కావలెను

నెల్లూరు పట్టణము నందలి మా వస్త్రముల వ్యాపార సంస్థకు, గ్రామాల వారీగ అమ్మకపు డీలర్లు కావలెయును. డీలరు డిపాజిట్, అగ్రిమెంట్స్ చేయనవసరము లేదు. డీలరుకు ఎలాంటి వ్యాపార అనుభవము అవసరము లేదు. మా వద్దకు ముందుగ వచ్చిన డీలర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును. కావున త్వరపడండి.

వివరములు స్వయముగా తెలిసుకొనుటకు మా చిరునామా

వెంకటేశ్వర వస్త్రాలయం
13/288, తిప్పరాజువారివీధి, నెల్లూరు - 1

రొయ్యలరైతులకు శుభవార్త

నీటిలో దాగుండే క్రిములను చంపేందుకు
నీటిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు వాడండి

ZEOLITE

మరిన్ని వివరాలకు
Phone : 23927, 24197

M/s. నందకిషోర్ ఏజన్సీస్
6/85 పుట్టపర్తి, శివాజీ నగర్
స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు - 524 002.

B.R Ads

సణుగుడు

(4 పేజీ కొరవ)

సభ్యుడు కూడా. బయట మైకు దొరికితే వినేవారి తలలు వాచిపోయే వరకు వదలి పెట్టని వారు, అసెంబ్లీలో పలికితే ముత్యాలు రాల్తాయన్నట్లు వుండి పోతున్నారు కారణమేమిటి చెప్మా!

శేషారెడ్డి గారికి కంగ్రాచ్యులేషన్స్!

* * *

ఈ దేశంలో ప్రజాస్వామ్యం బ్రతికి వుందంటే అది న్యాయవ్యవస్థ పుణ్యం. కోర్టులున్నాయనే ధైర్యమే చాలా సందర్భాలలో ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం సడలకుండా నిల్పుతుంటుంది. ఆ న్యాయవ్యవస్థకి కళంకం అంటుకుంటే? మురికి పడితే? అవినీతి దుర్గంధం అలుముకుంటే? ఆశ్రిత పక్షపాతపు అంటురోగం సోకితే? ఇంక ప్రజలకు దిక్కెవరు? ప్రజాస్వామ్యానికి రక్షణ ఏది? సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామస్వామి దురంతాలు విన్నాం; చూశాం! అది ఉన్నత న్యాయస్థానం కాబట్టి, అలజడి కూడా ఉధృతంగా వచ్చింది. కాని క్రింది స్థాయి న్యాయమూర్తులు స్వచ్ఛత కోల్పోతే, కోర్టులలో కుంభకోణాలు జరిగి పోతుంటే ప్రజలకు తెలిసేదెట్లా? అందోళన ప్రారంభమయ్యేదెట్లా? మన కోర్టులన్నింటిలో న్యాయదేవతకు పూజలు అందుతున్నాయా? న్యాయమూర్తులు ఆమెకు పరిరక్షకులుగా వ్యవహరిస్తున్నారా?

న్యాయాన్ని అర్థించి, న్యాయం జరుగుతుందని విశ్వసించి కోర్టులకు వెళ్లేవారికి నిజంగా న్యాయం జరుగుతున్నదా? సాక్ష్యాలు, ఆధారాలు కాకుండా ఇతర పలుకుబడులు, ప్రలోభాలతో తీర్పులు ప్రకటించే సంఘటనలు వుంటే ఎవరైనా ప్రశ్నించ గల్గుతున్నారా? లోకానికి వెల్లడి చేయగల్గుతున్నారా?

కోర్టుల తీరు పరిశీలిస్తుంటే ఇటువంటి ప్రశ్నలెన్నో తలెత్తుతున్నాయి. కోర్టు కేసుల నడవడిపైన, తత్సంబంధిత న్యాయవాదుల ప్రవర్తన పైన పలు ఫిర్యాదులు, పుకార్లు వినవస్తున్నాయి. చివరకు న్యాయమూర్తులు - జిల్లా స్థాయి కాని, మెజిస్ట్రేట్ స్థాయికాని, మరే స్థాయి గాని చాలా రిజర్వుడుగా వుండేవారు. ఎంతో అవసరమైతే తప్ప వారు పబ్లిక్ ప్రదేశాలకు వచ్చేవారు కాదు; జనంతో కలిసేవారు కాదు. రాజకీయవాదుల వద్ద కన్పించేవారు కాదు. బంధు మిత్రులను కోర్టు వ్యవహారాలు మాట్లాడనిచ్చేవారు కాదు. బహుమతులు, కాంప్లిమెంట్లు స్వీకరించేవారు కాదు. ఎంతటి వారైనా న్యాయమూర్తికి ఎదుట నిలబడి మాట్లాడాలంటే జంకేవాడు. ఇప్పుడా పరిస్థితి లేదు. న్యాయమూర్తుల గురించి జనం చాలా ఫ్రీగా మాట్లాడేస్తున్నారు. అతిథి భవనాలలో, ఇళ్లలో కూడా వారు అధికారులతో వున్న వాయకులను కలవడం సాధారణమై పోయింది ... బంధుమిత్రుల చిరునామాలు వెదకడం సాధారణమై పోయింది. ఫలానా వారని పేరు చెప్పడం, వేలెత్తి చూపడం సాధ్యం కాదు కాని, కక్షిదారులతో నేరుగా, లేదా న్యాయవాదుల మధ్యవర్తిత్వంతో బేరసారాలు జరుగుతున్నట్లు వదంతులు విన్పిస్తున్నాయి. ఇవి నిజమా, కల్పితాలో తెలియదు. కాని ఇటువంటి పుకార్లు, ప్రచారాలు న్యాయస్థానాల పైనే ప్రజలకు నమ్మకాన్ని నశింప జేస్తాయి.

నెల్లూరులో గుమ్మడి కాయల దొంగలెవరైనా వుంటే భుజాలు తడుముకోవడం కాదు - దారి తప్పిన ప్రవర్తనను సరిదిద్దు కోవడం మంచిది. న్యాయమూర్తులను విమర్శించకూడదు, విమర్శలకు కంటెమ్ట్ ఆఫ్ కోర్ట్ విచారణ, శిక్షలన్న భయం విమర్శకుల నోళ్లను ఎంతో కాలం మూయలేదు.

* * * *

నలుగురు ఒకచోట చేరితే కుల ప్రస్తావన; దినపత్రిక తెరిచి చూస్తే కుల సంబంధ వార్తలు, ప్రకటనలు; నాయకులు వేదికెక్కితే కులం పేరుతో వీరావేశాలు; ఎక్కడ చూసినా కులం కంపే. కుల గజ్జిని వంటికంతా ప్రాకించుకొని సహించినట్లు గీరుకుంటూ తిరగడం ఫ్యాషనై పోయింది.

ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైందీ అసహ్యకర సంస్కృతి. కలరా, ప్లేగు వ్యాధుల వలె వూరూరు, ఇల్లిల్లూ ప్రాకి, ప్రజల మానసాలలో దూరి, చెద పురుగుల వలె దొల్చి వేస్తున్నది. కులం ప్రస్తావన తేవడానికి సిగ్గు పడాల్సింది పోయి, చాటుమాటుగా చెవులు కొరుక్కోవలసింది పోయి పబ్లిక్‌గా, అదేదో ఘనతైనట్లు మాట్లాడేస్తున్నారు. ఏ ఆలోచన చేసినా ఆ కోణం నుంచే. విజయ భాస్కరరెడ్డి గారు ఈ ఏడాదిన్నరలో చేసిన నియామకాల జాబితా ఒకటి చూశాను. అందులో 80 శాతం ఆయన కులస్తులే. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి, మెజిస్ట్రేట్ కోర్టు స్వీపరు వరకు కులం అర్హతగా నియామకాలు జరిగి పోతున్నాయని గలభాగా వుంది. పివి నరసింహారావు కుల పిచ్చిపై ఆ మధ్య ఒక ఆంగ్ల వారపత్రిక పెద్ద పట్టిక ఇచ్చింది. బ్రాహ్మణాధిక్యం పునరుజ్జీవనానికి ఆయన చాప క్రింద నీరువలె పని చేస్తున్నారని ఆరోపణ చేసింది.

కాన్షీరాం సంగతి తెలిసిందే. తమ కుల అభ్యున్నతి కంటే, పరాయి కులాల పట్ల ద్వేషం పెంచడానికి ఆయన, ఆయన అనుచర బృందం సాక్షాత్తు మహాత్మా గాంధీని వీధిలోనికి లాగుతున్నారు. కుల అసమానతల నిర్మూలనకు జీవితాన్ని పణంగా పెట్టి పోరాడిన మహాత్మునికి కులం రంగు పూసే నీచ సంస్కృతి మన కళ్ల ముందే విష వాయువులాగా ప్రసరిస్తుంటే చూస్తూ వుండి పోతున్నాం మనం.

వెనుక బడిన కులాల పేరుతో జరుగుతున్న ఆగం ఇంకొక ... కృతి మించి పోతూంది. కులం సంఖ్యను చూపి, ఓట్ల ... గారడీలు చేసి, బ్లాక్‌మెయిల్ చెయడం ఒక ఆనవాయితీగా మారింది. పదవులిస్తే కులం పేరు కూడా

కొరవ 6 పేజీలో

పివి ఇచ్చిన వరం రైతన్న పరం కావాలి!



స్వేచ్ఛగా ధాన్యం రవాణా చేసుకొనే హక్కును ప్రధాని శ్రీ పివి నరసింహా రావు భారత రైతాంగానికి ప్రసాదించారు. కాని ఆ హక్కును కాలరాచి, రాజకీయ స్వార్థం కోసం రైతును పట్టపగలు దోపిడీ చేస్తున్నారు. రైతు బిడ్డల భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారు. వారి రక్తం పీలుస్తున్నారు.

అడగక పోతే అమ్మయినా పెట్టదు!

ధాన్యం స్వేచ్ఛా రవాణాను అనుమతించక పోవడం వల్ల రైతులు తమ పంటకు గిట్టుబాటు ధర పొందలేక పోతున్నారు. ఇదేమీ చిన్న నష్టం కాదు. రెండెకరాల పంటను స్వేచ్ఛగా ఇతర రాష్ట్రాలకు తరలించి అమ్ముకో గల్గితే వచ్చే ఆదాయానికి, ఇప్పటి ఆదాయానికి పోల్చి చూస్తే రైతు నికరంగా ఏడాదికి ఒక సవర బంగారు విలువైన ధనం నష్టపోతున్నాడు.

ఇది అన్యాయం, ఇది అక్రమం. ఇది పట్టపగలు దోపిడీ! రైతులు దీన్ని ఎదిరించాలి; ప్రతిఘటించాలి; పోరాడి సాధించాలి; అడగక పోతే అమ్మయినా పెట్టదు. ధాన్యం స్వేచ్ఛా రవాణా రైతు హక్కు; ప్రధాని శ్రీ పివి నరసింహా రావు ఇచ్చిన వరం; అది మన పరం కావాలి. రైతులలో ఐక్యతలేదనే అపప్రథవుంది. ఆ ప్రచారాన్ని త్రిప్పికొట్టండి. అందరూ కలసి ఐక్యంగా, సంఘటితంగా, సమష్టిగా పోరాడదాం రండి.! రైతులు మూకుమ్మడిగా నిలదీస్తే ఎంతటి వారైనా దిగిరాక తప్పదు. మన న్యాయమైన ఈ హక్కును మూడు నెలల్లో సాధించ గలమన్న నమ్మకం నాకుంది. అసాధ్యం కానే కాదది. కావలసిందల్లా మనలో ఐక్యతే. మనలో పోరాట పటిమే. మనందరి మేలు కోసం తలపెడుతున్న ఈ ఉద్యమంలో భాగస్వాములు కావల్సిందిగా వారంతా

యువజన రైతు సమాఖ్య

సభ్యులుగా చేరమని ఆహ్వానిస్తున్నాము. ఆరు కాలాలు కష్టించి పండించిన పంటను కూటి నీళ్ల ధరకు అమ్ముకోవలసిన దుస్థితిని, దురన్యాయాన్ని అంతం చేద్దాం రమ్మని పిలుస్తున్నాము.

పెళ్లకూరు వసంత్ కుమార్ రెడ్డి,
యువజన రైతు సమాఖ్య
16/2909, జవహర్‌లాల్ రోడ్డు, విఆర్ కాలేజి దగ్గర, నెల్లూరు.

మానవాభ్యుదయాన్ని ధ్వనింపజేసే కథల సంపుటి

మనిషి

శ్రీ పొట్లూరి సుబ్రహ్మణ్యం రూపొందించిన మూడవ కథల సంపుటికి "మనిషి" అని నామకరణం చెయ్యటం అర్థవంతంగా వుంది. ఎందుచేతనంటే, ఈ సంపుటిలో వున్న పది కథలూ మనిషి జీవిత వృత్తంలోని విభిన్న దృశ్యాలకు, వాస్తవ దృశ్యాలకు మనోజ్ఞమైన అక్షర రేఖలుగా విలసాయి గనుక.

"మనిషి" అనే పదంలో ప్రమోదకరమైన, ప్రమాదకరమైన రెండు ఇంగ్లీషు పదాలు ఇమిడి వున్నాయి. ఒకటి "మని" (డబ్బు), రెండవది "షి" (స్త్రీ). ఈ డబ్బును, స్త్రీని సద్వినియోగ పరచుకుంటే మనిషి జీవితం మహోన్నత మవుతుంది. సామాన్యుని బాధను గుర్తిస్తుంది. దుర్వినియోగ పరిస్తే అధః పతనమవుతుంది. స్వార్థశక్తిగా అందరినీ దోచుకుంటుంది. మనిషికి సంబంధించిన ఈ అంతరార్థాన్ని, పర్యవ్యాపం పరిసరాల్ని విశదీకరించి, తన కథల్లో వెలుగు వెల్లువలు విరియించాడు రచయిత. వివిధ స్థాయిల్లోని మనిషి పరిస్థితుల ప్రతి కదలికకు చలించి, ప్రతి చలనానికి స్పందించి ప్రతి కథలో మానవాభ్యుదయాన్ని ధ్వనింప జేశాడు. దుఃఖ భూయిష్టమైన జీవన యాత్రలో, బాధలను దిగమింగిన కన్నీటి ధారను, రక్తం కనిపించని కత్తి కోతలను, శబ్దం వినిపించని ముష్టి ఘాతాలను గమనించిన రచయిత, సంస్కారం ఏ దిశగా పయనించాలో నిర్దేశించాడు. మానవతకు ప్రాతినిధ్యం వహించాడు. మానవ ధర్మం ప్రబోధించాడు. మనిషిలో మార్పును వాంఛించాడు.

> **గ్రంథసమీక్ష**
>
> రచయిత
> **పొట్లూరి సుబ్రహ్మణ్యం**
> సమీక్షకుడు
> **గ్రిద్దలూరు గోపాలరావు**
> ప్రతులకు
> **మహీధర్ పబ్లికేషన్స్**
> పూలతోటవారివీధి,
> కోవూరు - 524 137.
> నెల్లూరు జిల్లా
> వెల రూ. 40/-

కథా వస్తువుకు ఎంత ప్రాతినిధ్యం ఇచ్చాడో, రచనా శిల్పానికి అదే ప్రాతినిధ్యం కూర్చాడు. శక్తి లేని వాడుక భాష ఉపయోగించాడు. "తీరని కోరిక, గుడ్డి దీపం, అందని ఆకాశం" కథల్లోని పల్లె భాష సొంపులు, వంపులు భూమ్మీద వాన చినుకు రాలినప్పటి పరిమళాన్ని ఆస్వాదింప జేస్తాయి. మిగతా కథల్లోని పుష్టికరమైన అక్షర సౌందర్యం, చదువరులకు, పువ్వు మీద వాలిన తుమ్మెద పొందే రసానుభవం కలిగిస్తుంది.

ముఖ చిత్రం, చిత్రకారుని భావనాశక్తికి మనిషి భావానికి బింబ ప్రతిబింబాలుగా నిలిచింది. కరెన్సీని, దాని మీద స్త్రీ ఎర్రని పెదాలను చిత్రించి "మనిషి" కి జీవలక్షణం కల్పించాడు చిత్రకారుడు.

కళాదేవత కొలువు దీరిన రత్నాల శాలగా భాసిల్లి, విద్యాభూషణ డాక్టర్ కొంగర జగ్గయ్య హృదయానికి అంకితం కావటం ఈ కథల సంపుటికి ప్రత్యేకంగా ప్రాప్తించిన పరమ సౌభాగ్యం. బహు జనాభిమానం సంపాదించ గల ఈ కథల సంపుటి బహు జనోపకారి అవుతుంది.

> **జిల్లా వార్తలు**
> (5 పేజీ కొరవ)

పూర్వకంగా స్థానిక పాఠశాలలోని ఉపాధ్యాయులు ప్రదర్శించిన 'పూజకు పనికిరాని పువ్వు' నాటిక పలువుర్ని ఆకర్షించింది. చివరిరోజు కార్యక్రమాలను జయప్రదం చేసిన వారందరికీ పరిపాలనాధికారి ఎస్.డి.ఇషాక్ ధన్యవాదాలు తెలిపారు.

విద్యానగర్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం

విద్యానగర్ ఎన్.బి.కె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం మార్చి 29 తేది ఘనంగా జరిగింది. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఐ.గోపాలరెడ్డి అధ్యక్షత వహించారు. ఎస్.వి.యు. వైస్ ఛాన్సలర్ పి.జయరామిరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ ఎన్.పద్మనాభరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. ప్రభాకరరావు వార్షిక నివేదిక సమర్పించారు. అనంతరం ప్రొఫెసర్ గోపాలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రథమ శ్రేణి కళాశాలల్లో ఎన్.బి.కె.ఆర్ కళాశాల ఒకటని, పూర్వ విద్యార్థులు నెలకొల్పిన వున్నత విలువలు, ప్రతిభా పాటవాలను ప్రస్తుతం చదివే విద్యార్థులు మననం చేసుకొంటూ ముందడుగు వేయాలన్నారు. విద్యార్థులచే స్వంతంగా ఆలోచింపచేసే అవకాశం, అవసరం కలుగ చేసినప్పుడే ఇంజనీరింగ్ విద్యకు సార్థకత; అందుకోసం సాంకేతిక విద్యా విధానాన్ని మార్పు చేయాలని ప్రొఫెసర్ జయరామిరెడ్డి సూచించారు. ఈ సంవత్సరం ఉత్తమ విద్యార్థిగా ఎన్నికైన శ్రీనివాస గౌతమ్, గత సంవత్సరం యూనివర్సిటీ ప్రథముడుగా నిలిచిన విద్యార్థి సిహెచ్ వాసు, ఆటల్లో ప్రతిభ కనపర్చిన జహీర్ అలీఖాన్‌ను ఈ సందర్భంగా అభినందించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రొఫెసర్ జయరామిరెడ్డి బహుమతి ప్రదానం చేశారు.

సమస్యల పరిష్కారానికి సమితి

తోటపల్లి గూడూరు మండలంలోని సమస్యల పరిష్కారానికి ఒక సమితి ఏర్పాటయ్యింది. రాజకీయాలకు అతీతంగా పని చేస్తామని ప్రజలు తమను వుపయోగించుకో వచ్చుని సమితి కార్యదర్శి వల్లూరు మోహనరావు కోరుతున్నారు.

మాజీ గ్రామాధికారికి సన్మానం

రాష్ట్రంలో ప్రప్రథమంగా గ్రామాధికారుల వసతి భవనం గూడూరులో నిర్మించి, మాజీ గ్రామాధికారి చెన్నూరు పట్టాభిరామయ్యను ఇటీవల సన్మానించారు. 30 ఏళ్ల క్రితం భవన నిర్మాణానికి ఆయన పడిన కష్టాలను గుర్తించి ప్రస్తుతం రాష్ట్ర గ్రామాధికారుల సంఘ అధ్యక్షులు దేవర్ల దశరథరామిరెడ్డి నాయకత్వాన గూడూరు సబ్ కలెక్టర్ సునీల్‌వర్మ చేత సన్మానింప చేశారు. పాతతరం నాయకులను గుర్తించి గౌరవించడం మంచి సాంప్రదాయమైనా ఆ రోజుల్లో సంఘ అభివృద్ధికి పాటుపడ్డ ఏ ఒక్కరికీ ఆహ్వానం పంపని వెలితి మాత్రం మిగిలింది.

వెంకటగిరిలో విద్యార్థి మృతి

హోలీ పండుగ సందడి వెంకటగిరిలో ఒక విద్యార్థి ప్రాణాన్ని బలి తీసుకుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ శిక్షణా సంస్థలలోని విద్యార్థులు ఒకరి పై మరొకరు రంగులు చల్లుకొని హోలీ సంబరాల్లో మునిగి తేలారు. అనంతరం విద్యార్థులంతా ఈత కొట్టేందుకు సమీపంలోని బావి వద్దకు వెళ్లారు. అందరితో పాటు బావిలోకి దిగి నీటిలో మునిగిన జె.వి. సుబ్బారావు (19) చాలా సేపటి వరకు పైకి రాలేదు. వెంటనే అతని స్నేహితులు కేకలు పెట్టుకొంటూ వెళ్లి పొలాల్లో పనిచేస్తున్న రైతులను పిలిచి వాళ్ల సహాయంతో సుబ్బారావును వెలికి తీశారు. కాని అప్పటికే అతను మృతి చెందాడు. సుబ్బారావు చీరాల వాసి. శవానికి పోస్టుమార్టమ్ నిర్వహించి అతని బంధువులకు అప్పచెప్పి వెంకటగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రసూల్ ఎన్‌కౌంటర్ పై కమీషన్ తీర్పుకు నిరసన

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం కార్యకర్తల శిక్షణా తరగతులలో పాల్గొనేందుకు కావలి వచ్చిన ఎపిసియల్‌సి ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలగోపాల్ ఆదివారం వారు పత్రికా కలవారితో మాట్లాడారు. 1991 సంవత్సరం అంతంలో హైదరాబాదు ఉదయం దినపత్రిక విలేఖరి రసూల్‌ను ఆయన మిత్రుడు జయప్రకాష్‌లను ఎన్‌కౌంటర్ పేరుతో పోలీసులు కాల్చి చంపిన కేసు పై ఏర్పాటైన టి.ఎల్.ఎన్. రెడ్డి కమీషన్ విచారణ నివేదికను తప్పు పట్టారు. రసూల్‌ను పోలీసులు తుపాకులతో కాల్చి చంపారన్న విషయం ధృవీకరిస్తూ సాక్ష్యాధారాలు చూపించడంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం విఫలమయినాయని చెప్పడం పై డా. బాలగోపాల్ అభ్యంతరం తెలియచేశారు. తిరుగులేని సాక్ష్యాలను కమీషన్ ముందుంచినా న్యాయమూర్తి చేసిన నిర్ధారణ ప్రజలకు న్యాయవ్యవస్థ పై విశ్వాసం పోగొట్టేదిగానూ, తెలంగాణా ప్రాంత విలేఖరులలో అభద్రతా భావాన్ని కల్గించేది గానూ తమకు నచ్చని వారిని ఎన్‌కౌంటర్ పేరుతో హత్యచేసి తప్పించుకోవచ్చునన్న విశ్వాసాన్ని పోలీసులలోనూ కల్గించేది గానూ వుందని డా. బాలగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు.

రసూల్ పత్రికా విలేఖరి అన్న విషయం డి.ఎస్.పి. రాజయ్యకు, ఎస్.పి. భాస్కర రెడ్డికి వారి క్రింద అధికారులకు బాగా తెలుసన్నారు. డిసెంబరు 27 న రసూల్‌ను కాల్చి చంపి, 29 తేది వరకు గుర్తు తెలియని నక్సలైట్లు అని ఉద్దేశ పూర్వకంగా ప్రకటించారని, ధర్మవరం ఎం.ఎల్.ఏ, హోంమంత్రి అనుమతితో శవాలను తీసుకెళ్లడానికి మార్చురీకి వెళ్లేలోగా పోలీసులు అక్కడి శవాలను మాయం చేశారు. నల్గొండ జిల్లా ఆలూరు ఎస్.ఐ. 28 వ తేది రసూల్ బంధువులను జరగరానిది జరిగి పోయినది మీరు అయినా జాగ్రత్తగా వుండండని చెప్పడం, 27 వ తేదిన రసూల్ మిత్రుడు కారు డ్రైవరు ప్రకాష్‌ను మెద్చల్ పోలీసులు పట్టుకెళ్లి చావగొట్టి రసూల్ నక్సలైట్ అని మూడు హత్యలతో సంబంధం వుందని బలవంతంగా స్టేట్‌మెంట్ రాయించు కోవడం జరిగింది. అదే రోజు రాత్రి రసూల్‌ను కాల్చి చంపారు. ఈ విషయాలన్నింటిని సాక్ష్యాధారాలతో కమీషన్ ముందు వుంచామని, అయినా రసూల్ ఎన్‌కౌంటర్‌లోనే మరణించాడని కమీషన్ నిర్ధారించడం దురదృష్టకరమని డా. బాలగోపాల్ చెప్పారు.

రాష్ట్రంలో జరిగిన 497 ఎన్‌కౌంటర్ హత్యలతో పాటు రసూల్ హత్యకేసును జాతీయ మానవ హక్కుల సంఘానికి నివేదిస్తామని తెలిపారు.

శివారెడ్డి పద్యాలు

పెళ్లకూరు రామచంద్రా రెడ్డి

పచ్చి కాంగ్రెసోడు, స్వచ్ఛందసేవాప
రాయణుండు దిట్ట రామచంద్ర
రెడ్డి, అంతటోడు లేడు అనినేననడంల
నూటికొకడె, కాదు కోటికొకడు!

ఎస్‌పి

నీదు నేర్పుకూర్పు నెల్లూరు పోలీసు
వర్గమునకు గొప్పవన్నెదెచ్చె
తాము నాకు క్రొత్త తర్వాత వివరిస్త
మంచిసెర్త ఎస్పి! మనవి జేస్త!

రకరకాల కార్డు రాష్ట్రాధిపతులైన
మూలముల డబ్బు మూల్గుతున్న
ఇండియాకు పెద్ద ఇలవేల్పు ఎరబుట్ట
లేకపోతె పెద్ద పాకు దెబ్బ!

బోయి భీమన్న

భీమన్న! నీ కవితలు
సామాన్యముగాదు ఖండచక్కెర
శ్రీ మద్రామయణమగు, పండిత
పామరులకుఅదియొకటోగిపండుగ,సెలవ్!

అజిమ, రహంతుల్లా

అందగత్తె అజిమ అపరంజి బంగారు
చందమామ వదురు, ఏమనందు పెళ్లి
వైభవమ్ము, కాదు వర్ణింప సాధ్యమ్ము
స్వీట్లు, వడలు లడ్లు లాట్లు లాట్లు!

మళ్లి జన్మకెను మహమ్మదీయుడనౌత
పల్లెటూరి కవికి ప్రాప్తముంటె
మాపురేపు గూడ మత్స్యమాంసాదుల్తొ
మునిగి తేల్త, పొద్దు మునలి తనము!

నెల్లూరు వైపే మళ్లీ అందరి చూపు

పొదుపు ఉద్యమం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా పేరు గడించిన నెల్లూరు జిల్లా మహిళలు పొదుపు లక్ష్మి పథకం ద్వారా సాధిస్తున్న ప్రగతి నేడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని జిల్లా కలెక్టర్ ఎం. సాంబశివ రావు చెప్పారు. 25 తేది బుచ్చిరెడ్డిపాళెంలో పొదుపులక్ష్మి మహిళా సదస్సులో ప్రసంగించారు. జిల్లా మహిళలను ప్రోత్సహించను ఇక నుండి మంజూరయ్యే ప్రభుత్వ పథకాలన్నీ మహిళలకే ఇస్తామన్నారు. పొదుపు లక్ష్మి పథకాన్ని విజయవంతంగా మూడు సంవత్సరాల పాటు నడప గలిగితే మహిళలే ప్రభుత్వానికి అప్పు ఇచ్చే దశకు చేరుకోగలరని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలోని 46 మండలాల్లోని మహిళలు 50 లక్షల రూపాయలకు పై గానే పొదుపు లక్ష్మి క్రింద పోస్టాఫీసుల్లో జమ చేసి వుండడం మహిళల ప్రగతికి నిదర్శనమన్నారు. ఈ పథకం వల్ల స్త్రీలలోని న్యూన్యతా భావం పోయి ఆత్మవిశ్వాసం వెల్లి విరుస్తుందన్నారు. మహిళలు సంఘటితంగా వుండి గ్రామాల్లో అక్రమాలకు పాల్పడే చౌక దుకాణాల డీలర్లను నిలదీయాలని జాయింట్ కలెక్టర్ సతీష్ చంద్ర సలహా ఇచ్చారు. సంఘటితంగా వుండే ఏదైన సాధించగలమని చెప్పారు. కార్యక్రమంలో పొదుపులక్ష్మి ప్రత్యేక అధికారిణి విజయభారతి, ఎమ్మెల్యే భాస్కర రావు, ఎమ్మెల్సీ సి.ఎన్. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పంచాంగం

28 తేది సోమవారము నుండి శుక్రగురువుల సమసప్తక స్థితి మంచిది కాదు. ముహూర్తములు లేవు.

ఏప్రెల్ తిథులు
ఫాల్గుణ బహుళ

తే2 శని సప్తమి రా.గ. 2.12 వ
తే3 ఆది అష్టమి రా.గ.12.51వ
తే4 సోమ నవమి రా.గ. 12.00 వ
తే5 మంగళ దశమి రా.గ. 11.34 వ
తే6 బుధ ఏకాద శి రా.గ.11.40వ
తే7 గురు ద్వాదశి రా.గ. 12.15 వ
తే8 శుక్ర త్రయోదశి రా.గ. 1.23 వ

స్వయంపాకుల శ్రీనివాసులు, ఎం.ఎ

సినిమా సినిమా సినిమా సినిమా సినిమా సినిమా

ఇవి పిచ్చి వేషాలు- అభిమానం కానేకాదు!

''నా వృత్తి పాత్రం. నా గానం మీకు నచ్చింది. మీరు నాకు అభిమాని అయ్యారు. అంతవరకు బాగానే వుంది. కాని దానిని నిరూపించడం ఎందుకు?'' అని ఎస్.పి. బాల సుబ్రహ్మణ్యం ఇటీవల మన రాష్ట్రం నుంచి తనమురూడానికి వచ్చిన ఒక అభిమానిని మందలించారు. బాలు చూస్తుండగానే ఆ అభిమాని చివాలున తన జేబులోంచి బ్లేడు తీసి, తన ఒంటన వేలికి గాయం చేసి, ఆ నెత్తురులో మహాత్మగా బాలు నుదుట తిలకం పెట్టారు. ''వీటిని పిచ్చి వేషాలంటారు. నేనేం మానవాతీతుడ్ని కాను.'' అన్నారు బాలు.

చిత్ర నిర్మాతకు ఫోరం వడ్డింపు

చిత్రం వసూళ్లు పెరగడానికి ప్రేక్షకులకు బహుమతుల ఆశ చూపించడం కొందరికి పరిపాటి. 1993లో అన్నపూర్ణ స్టూడియోస్ వారి ''రక్షణ'' విడుదల సందర్భంలో యాభై రూపాయలు మని ఆర్డర్ ద్వారా పంపిన వారికి ఆ చిత్రం తాలూకు ఆడియో క్యాసెట్, కీ చెయిన్, ఒక లాబరీ టిక్కెట్టు, సినిమా టిక్కెట్టు గల ఒక పొట్లం పంపిస్తామని ఆ నిర్మాతలు కొన్ని దిన పత్రికలలో ప్రకటనలు చేశారు. వి.సోమరాజు అనే వ్యక్తి ఆ విధంగా తాను పంపిన యాభై రూపాయలకు గిఫ్ట్ బాక్స్ రాలేదని,

రక్తతిలకం దిద్దిన వెర్రి అభిమానికి ఎస్‌పిబాలు చీవాట్లు

కనీసం తన ఉత్తరానికి సమాధానం కూడా రాలేదని పశ్చిమ గోదావరి జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు. ఆ యాభై రూపాయలకు 18 శాతం వడ్డీ చెల్లించడం తోపాటు నష్ట పరిహారం కింద వంద రూపాయలు, ఖర్చుల కింద 150 రూపాయలు చెల్లించాలని నిర్మాత అక్కినేని వెంకటేను ఫోరం ఛైర్మన్ ఎస్. రామలింగేశ్వర రెడ్డి ఆదేశించారు.

నమోదు చేయబడిన చిత్రాల పేర్లు

ఆలయం సినిమా లిమిటెడ్ ''బొంబాయి'', శ్రీ లక్ష్మీ పద్మజా మూవీస్ ''డేంజర్ యమ డేంజర్'', అర్జున్ ఆర్ట్ ప్రొడక్షన్స్ ''డైరెక్టర్ గారి పెళ్లాం'', శబరి మూవీ మేకర్స్ ''ఘరానా ఖైదీ'', గిరిధర్ మూవీస్ ''ఘరానా తమ్ముడు'',ఆర్.జి.ని. ఫిలిమ్స్ ''ఇండియా నెంబర్ వన్'', లావణ్య చిత్ర కంబైన్స్ ''కొండపల్లి రాజా'', శ్రీమంత్ ప్రొడక్షన్స్ ''నిందితుడు'', భరత్ ఫిలిమ్ సర్క్యూట్ ''ప్రజా రక్షకుడు'', టి.కృష్ణ మెమోరియల్ పిక్చర్స్ ''ప్రియాంక'', రవి ఆర్ట్స్ ''రాజకీయం'', సాయిశ్రీ మూవీస్ ''రైతు భారతం'', శ్రీ షిర్డీ సాయి ప్రొడక్షన్స్ ''రెడ్డిగారి ఆవేశం'', వి.గుణశేఖర్ చిత్రం ''వేటగాడు 1994'', శ్రీ చిత్ర క్రియేషన్స్ ''టాప్ హీరో''.



పరుగోపరుగు చిత్రంలో ప్రదీప్ శక్తి, గిరిబాబు, రాజేంద్రప్రసాద్, అనంత్.

ఖల్ నాయక్‌కు నాయిక దొరకడం ఎంత కష్టమైందో!

''ఖల్‌నాయక్'' చిత్రం తెలుగులో పునర్నిర్మింపబడుతున్న విషయం అందరికీ తెలిసిందే. నాయకగా ఖుష్బూను అడిగారు. ఆమె ముందు సరేనంది. ఆ తర్వాత విముఖత చూపింది. మధుబాలను సంప్రదించారు. రెండు రోజాలయ్యాక ఆమె కాల్‌షీట్లు సర్దుబాటు చేయలేక పోయానంది. చివరికి సుకన్య బుక్ అయ్యింది. అసలు అర్జున్‌ను హీరోగా బుక్ చేసి, ఆయన చేతే దర్శకత్వం చేయించాలనుకున్నారు. అదీ కుదరలేదు. ఇప్పుడు వినోద్‌కుమార్, రఘు నటించనున్నారు. ఎ.జగన్నాథ్ దర్శకుడు.

అన్నీ ''టాప్ లే, నెంబర్ వన్ లే''

ర కోట్ల జనాభా గల మన రాష్ట్రంలో 4 కోట్ల రూపాయల పెట్టుబడితో చిత్రాలు తీసే నిర్మాతలు ప్రేక్షకులను ఆకర్షించడానికి పెట్టే పైటిల్స్ చూస్తుంటే ఎంతో తమాషాగా ఉంటోంది. కృష్ణతో ఎస్.వి.కృష్ణారెడ్డి దర్శకత్వంలో తయారైన ''నెంబర్ వన్'' చిత్రం బాగా ఆడుతోంది. ఆయన దర్శకత్వంలోనే బాలకృష్ణ నటించే చిత్రానికి ''టాప్ హీరో'' అని నామకరణం జరిగింది! జూన్ నుంచి ప్రారంభమయ్యే ఈ శ్రీచిత్ర క్రియేషన్స్ చిత్రంలో నాయికగా ఒక నవ నటిని పరిచయం చేయాలనుకుంటున్నారు. ఆంట గోపినాథ్ నిర్మాత.

గౌతమి సొంత చిత్రం

గౌతమికి తమిళంలో చిత్రాలు లేవు. నాకు ఒకరు వేషాల్వక పోతే

కొరవ 11 పేజీలో

హింసాత్మక ప్రేమను ఫార్ములాగా మార్చిన కమర్షియల్ మసాలా

బాజీగర్

గత సంవత్సరం హిందీ చిత్రసీమలో బంపర్ హిట్టయ్యి యువ నటుడు షారుఖ్‌ఖాన్‌ను 'టాప్‌హీరో'పై కూర్చోబెట్టిన చిత్రమే బాజీగర్. దీనితో హీరో తన కుటుంబాన్ని సర్వనాశనం చేసిన వ్యక్తిపై పగ తీర్చుకోను అతని కుమార్తెలను ప్రేమ పేరుతో తన వుచ్చులోకి లాక్కుంటాడు. అనంతరం వారి హత్యకు పథకం రచించి ఒక హీరోయిన్‌ను అంతమొందిస్తాడు. మరొక హీరోయిన్‌ను కూడా ఇదే బాటలో హత్యచేయాలని తల పోస్తుండగా ప్రత్యర్థి పైఎత్తుకు చిత్రయ్యి ప్రాణా... విడుస్తాడు.

చిత్ర సమీక్ష
అల్లూరు రహీం

ప్రేమలో నిజాయితీ వుంటుంది. తన అక్కతో పాటు తండ్రిని కూడా హీరో చంపేశారని తెలిసినా అతన్ని చివరి సన్నివేశంలో కూడా అసహ్యించుకోడు హీరోయిన్. కానీ పగ, ప్రతీకారం, ద్వేషాలతో నిండిన హీరో కనీసం ప్రాణాలు విడిచే సమయంలో నైనా తన ప్రక్కనే వున్న ప్రియురాలిపై చూపైనా నిలుపక తన తల్లి ఒడిలో ప్రాణాలు విడుస్తాడు. ప్రేమించిన ప్రియురాల్లను తెలివిగా అంతమొందించడం , వీనుల విందైన పాటలు,సరిక్రొత్త హీరోయిన్ల అందచందాలు, హీరో అద్భుత నటన కలిగిన ఫార్ములాయే చిత్ర విజయానికి తోడ్పడింది.

విశ్వనాధశర్మ (అనంత మహదేవన్) తన మిత్రుడు ఛీపా (దిసౌజా) ను నమ్మి అతనికి పవర్ పట్టా ఇచ్చి వేరే చోటకు వెళ్లి వచ్చే సరికి ఆస్తి మొత్తం ఛీపా చేజిక్కించుకుంటాడు. దానివల్ల భార్య బిడ్డలతో సహా వీధిన పడతాడు శర్మ. తన కుమార్తెకు వైద్యం చేయించలేక పోయానన్న బాధలో గుండె పోటుతో మరణిస్తాడు. ఈ సంఘటనలన్నీ చూసిన అజయ్ (షారుఖ్‌ఖాన్) చిన్ని హృదయం రగిలిపోతుంది. అక్కడనుండే పగ, ప్రతీకారం, ద్వేషాలకు అంకురార్పణ జరుగుతుంది. కాలేజీలో చదువుతుండే ఛీపా పెద్ద

కొరవ 11 పేజీలో

☆ ADD STRENGTH TO YOUR LIFE ☆

ACQUIRE COMPUTER KNOWLEDGE THROUGH BABBAGE INSTITUTE OF INFORMATION TECHNOLOGY

BIIT

COMPUTER CENTRE

WE OFFER THE FOLLOWING JOB ORIENTED COMPUTER DIPLOMA COURSES PART TIME & FULL TIME

1. DOEACC - 'O' LEVEL PROGRAMME
2. POST GRADUATE DIPLOMA IN COMPUTER SCIENCE
3. DIPLOMA IN SOFTWARE APPLICATION (COMMERCIAL)
4. SHORT TERM PROGRAMME
   BASIC, COBOL, PASCAL PROGRAMME
   MS-DOS OPERATING SYSTEM
   WORD PROCESSING
   DBASE III OR IV
   DATA ENTRY OPERATION
5. ADVANCED COURSES
   LOCAL AREA NET WORK (LAN)
   'C' & UNIX, CAD, RDBMS (ORACLE) AND DTP

ADMISSIONS STARTED

CLASSES WILL BE COMMENCING ON 6th APRIL, 1994.

BIIT COMPUTER CENTRE

Opp: SAIBABA MANDIR,
NELLORE - 524 001. ✆ : 29505

CROWN-TV



ఎలక్ట్రానిక్స్ సేల్స్ & సర్వీస్ డీలర్స్:

ప్రియా సౌండ్స్ త్రుంకరోడ్. నెల్లూరు

ఫో: 25428

పశువుల మందులు

అన్ని ప్రముఖ కంపెనీల పశువుల మందులు మా వద్ద లభించును.

వివేకా మెడికల్స్

16/1295/3, పొగతోట, నెల్లూరు.
ఫోన్: 27691

తాటిచెట్లు అమ్మబడును

మంచి చేవ గల్గిన తాటిచెట్లు అమ్మబడును. వివరములకు

ఈపూరు వెంకురెడ్డి
గూడూరు వారి పాళెం
వెంకటాచలం మండలం
నెల్లూరు - వెంకటాచలం
తిరుమలమ్మపాళెం బస్

In the Court of 2nd Addl Subordinate Judge Vijayawasda

S.C. 342 / 93

Between:

Munnangi Nagayya- Plaintiff and chenna Reddy Brahmaiah, Defendant

The above said suit is psoted for 7-4-1994 for appearance of the defendants at 10.30 a.m.

The defendant chenna Reddy Brahmaiah is informed to appear before the Court on 7-4-94 at 10.30 a.m. and represent his case if any, on the said date, failing which the matter will be disposed off exparte.

K. ANNESWARA SASTRY
ADVOCATE FOR PLAINTIFF
GIRI STREET, S.N. PURAM,
VIJAYAWADA- 520 011.

కావలి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ మున్సిఫ్ కోర్టులో

OP No. 1/94

పిటీషనర్: జోతిబుజ్జమ్మ

Vs.

శ్రీభవానమ్మ

రెస్పాండెంట్: బల్లి బిట్టెమ్మ

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియ చేయడమే మనగా పై నంబరున పిటీషనర్ తన భర్త అయిన శ్రీ జోతి రమణయ్య చనిపోయినందున, తాను అతనికి వారసురాలునని పెన్షన్ రాబట్టుకొనుటకు పిటీషన్ పెట్టి యున్నామని సక్సెషన్ సర్టిఫికేట్ కొరకు దాఖలు చేసి యున్నందున 21-4-94 తేది న వాయిదా వేయబడియున్నది. కనుక ఇందు విషయమై ఎవ్వరికైనను ఆక్షేపణలు వున్న యెడల ఆరోజు పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేనియెడల ఎక్స్‌పార్టీగా తీర్మానించ బడును.

G. మాల్యాద్రి,
అడ్వకేట్, కావలి.

జనవాణి

(3 పేజీ కొరవ)

దొంగతనాల్లో వేర్పరితనం- గోవిందా. గోవిందా లోనైతే తిరుపతి వెంకన్న కిరీటం దొంగతనం ప్రధాన ఇతివృత్తం. వర్మ తీసిన చిత్రాలు సమాజానికి ఏ మాత్రం వుపయోగపడ్డాయో ఎవరూ చెప్పక పోయినా, వాటిలోని హింసను యధాతథంగా సెన్సార్ బోర్డు అనుమతించి చాలా తప్పు చేసింది. బోర్డుకు నియమ నిబంధనలు లేకపోవడం వల్లే వర్మ విమర్శలు చేయగలిగారు. సెన్సార్ అధికారులు తేలు కుట్టిన దొంగల్లా నోరు మూసుకున్నారు. ఈ మధ్య నటి రోజా నిర్మించిన సమరం చిత్రంలో సన్నివేశాలు మరీ అతిగా వున్నా సెన్సార్ వారు అనుమతించారు. రిలీజ్ అవుతున్న పలు సినిమాల్లో పాటలు మాటల గూర్చి చెప్పలేము. అదే మంచి ప్రజలు చూస్తున్నారని స్టేట్‌మెంట్లు. సరైన విధానాల రూపకల్పన జరుగనంత వరకు ఈ విశృంఖల ధోరణిని అడ్డుకునే వారే లేరు. ప్రభుత్వం ఈ విషయమై ఎందుకు మౌనంగా వుందో అర్థం కావడం లేదు.

-ఎం. నరసింహారావు

సికింద్రాబాద్

పలుకని బుచ్చి టెలిఫోన్లు

బుచ్చిరెడ్డిపాళెంలోని ఫోన్లు సకాలంలో పని చేయక వినియోగదారులను తరచూ ఇబ్బంది పెడుతున్నాయి. ఏదైనా ముఖ్యమైన పనిపడి నెల్లూరుకు ఫోన్ చేయాల్సి వచ్చినప్పుడు రింగ్ చేసి చేసి వేళ్ళు నొప్పెట్టడం మినహా నెంబరు దొరికి చావదు. స్థానిక అధికార్లకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితమే లేదు. అలంకారానికి తప్ప బుచ్చి ఫోన్లు ఎందుకూ పనికి రావడం లేదు.

బుచ్చిరెడ్డిపాళెం -ఐ. రామకృష్ణ

బస్ షెల్టర్ కావాలి

నిప్పో సెంటర్ ఇటీవల కాలంలో బాగా అభివృద్ధి చెందింది. నిత్యం వందలాది మంది ఇక్కడి నుండి టౌన్‌లోనికి రావడం పోవడం జరుగుతూంది. కాని ఇక్కడ ప్రజలు టౌన్‌బస్సులు, ఆటోల కోసం వేచి వుండను బస్ షెల్టర్ లేదు. ఎండైనా, వానైనా ప్రజలు పడిగాపులు కాస్తూ నిలబడి వుండవల్సిందే. ఆర్టీసిలేదా టౌన్‌లోని ఏ స్వచ్ఛంద సంస్థలేదా. నిప్పో ఇక్కడ ఒక బస్ షెల్టర్ కట్టించి పుణ్యం కట్టుకోవాలని మనవి.

నెల్లూరు -డి. సుబ్బారావు

బానిసత్వానికి చేరువలో వ్యవసాయ రంగం

రైతు సమస్యల పరిష్కారం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా, నిర్బాధ్యతతో వ్యవహరించడం దురదృష్టకరం. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేనే లేదు. బానిసత్వానికి చేరువగా వ్యవసాయ రంగం నిలువబోతూంది. ఫుడ్ కార్పొరేషన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లెక్కకు మించిన నియమ నిబంధనలను అధికారులు విధిస్తున్నారు. జిల్లాలో ఎఫ్‌సిఐ గోదాములు ఇంత వరకు నిర్మించక పోవడం దారుణం. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి దిగుమతి చేసుకొన్న బియ్యాన్ని గోదాముల్లో నింపేముందు అధికారులు జిల్లాలోని పంట విషయమై ఆలోచించి వుంటే రైతుకు ఇప్పుడున్న సమస్యలకు తోడుగా కొత్త సమస్య వచ్చేది కాదు. అధికారులు ప్రతి విషయం పై సమగ్ర అవగాహన చేసుకొని, నిర్ణయాలు తీసుకునే ముందు రైతు సంఘాల నాయకులతో కూడా సంప్రదించాలి.

నెల్లూరు -ఆచార్య పిసి రెడ్డి

రామకృష్ణుల పై చర్చ అనవసరం

గత మాసం రోజులుగా శ్రీకృష్ణుడు పురాణ పురుషుడా, ప్రబంధ పురుషుడా అనే అంశం పై జమీన్‌రైతులో రసవత్తర చర్చ జరిగింది. వాల్మీకి సృష్టించిన ధర్మమూర్తి శ్రీరామచంద్రుడు; అదే విధంగా వేదవ్యాసుడు సృష్టించిన రాజ్యవేత్త శ్రీకృష్ణుడు. రామాయణం, భారతాల కథలు నిజాలో, అబద్ధాలో చర్చ ప్రస్తుతం అనవసరం. వీటిలో మంచి మాత్రం తీసుకొని మిగతాది వదిలేద్దాం.

గూడూరు -ఆవుల కొండయ్య

50 ఏళ్ళ క్రితం ఈ వారం

నెల్లూరు ముచ్చట్లు

రేషనింగ్

నెల్లూరు టవున్‌లో రేషనింగ్ ఏప్రెలు 15 తేది నుండి ప్రారంభం కావచ్చునని యిదివరకు వ్రాశాము. కాని ఆ తేదికి ప్రారంభమయ్యేట్లు కనిపించలేదు. మరొకవారం పట్టవచ్చు. ఏది ఎట్లున్నా మేనెల 1 తేది నుంచైనా తప్పదు.

రేషనింగు ఆఫీసు ముంగమూరు వారి వీధిలో వకీలు ముంగమూరు వెంకట సుబ్బారావుగారి ఇంటికి పడమర ప్రక్క యింట్లో ప్రస్తుతం పెట్టారు-

17-3-44 పత్రికలో బియ్యం రేషను మనిషి1 కి దినానికి అర్థసేరు నవటాకు అని ప్రకటించాము. అది పొరపాటు. అర్ధసేరు సెటాకు మాత్రమే.-

స్వంతంగా పండించుకునేవాళ్లు ఎన్ని ధాన్యమైనా వుంచుకోవచ్చును. వ్యక్తులు నెల్లూర్లో వుండి భూములు వెలుపల వున్న సందర్భంలో పర్మిషను మీద 1 సం. గ్రాసం తీసుకోవచ్చునని వ్రాశాము. కాని ఆ ధాన్యంలో నుంచి గూడా రేషను కార్డు లెక్క ప్రకారం వాడుకొని కొర్రధాన్యానికి లెక్క యివ్వవలసిందే కాని, ఎక్కువ ధాన్యం స్వంతానికి వాడుకోవడానికి వీలు లేదు.

కష్టపడి పనిజేసేవారికి యీ రేషను చాలదనే ప్రశ్నపై విచారిస్తే అట్టివారికి అవసరమైనచో రేషను హెచ్చిస్తారట.

ఇండ్లలో పనిజేసే యానాది మొదలగు పొశర్లకు గూడా యజమానులు ఇండిబెట్టడానికి వీలులేదు. యజమాని యింటివద్ద భోంచేసి, అక్కడే పడుకొనే వారికి మాత్రమే ఆ యింట్లో రేషను వుంటుంది. కాపురం వేరే వుండి యజమాని యింట్లో పనిజేసే వారికి కాపురమున్న చోటనే రేషను కార్డు వుంటుంది. కావున బ్రాహ్మణ యిండ్లలో పనిజేసే యానాదులకు యికా పస్తే, యజమాని దర్చివ్వాలి. పనివాళ్లు తమ రేషను కార్డు ప్రకారం కొనుక్కోవాలె- అంతేగాని మార్గాంతరం లేదు. పల్లెలనుండి జబ్బులతో నెల్లూరుకు వైద్యం వగయిరాల నిమిత్తం వచ్చేవారి విషయం- అట్టివారు కోరితే తమ గ్రామాన్నుండి బియ్యం తెచ్చుకోవడానికి పర్మిషను దొరుకుతుంది. కాని ఆ తెచ్చుకున్న బియ్యం కూడా ఈ రేషను కార్డు ప్రకారమే ఖర్చుబెట్టాలె గాని హెచ్చు ఖర్చు సేయరాదు.

ఇంకేమైనా అనుమానాలుంటే అడుగండి'' వినయత్వంగా తీర్చుతాం''.

అవీ- ఇవీ

గొప్ప నాగస్వరం విద్వాంసుడు: నెల్లూరు మూలపేట వేణుగోపాలస్వామి తిరునాళ్లకు కుంభకోణం నుండి కె. రామయ్యపిళ్లైగారు తన పార్టీతో వస్తున్నారు. రు500లు కట్నం వుంటుంది. ఏప్రెలు 8,9,10 తేదులు. సంగీత పిపాసులంతా దయచేయండి- దీనిమీద మా అభిప్రాయమేమింటంటే మాంచి తెలివిగల్ల కుర్రాళ్ళ యేరి స్కాలర్‌షిప్ ఫండ్సు యిచ్చి యీలాంటి గొప్ప విద్వన్మణిని తయారుచేయించమని వేణుగోపాల ట్రస్టీలను, గండవరం ట్రస్టీలను,బుచ్చి ట్రస్టీలను కోరుతున్నాం.

-విమర్శకుడు.

నాటకాల పురాణం

'కోకిల'

ఇది చైత్రమాసం కాబట్టి ''కోకిల'' అంటుండగానే 'కుహూకుహూ' ధ్వనులు జేసే కోకిల అనుకుంటారేమో కొంపదీసి; అది గాదు సుమండీ. ఇది నాటకం; అంటే డ్రామా అన్నమాట-

ఒకనాడు కోకిల అని ప్రకటించి రాత్రి 10 గం.కు చింతామణిగా మారింది. మరొక వాయిదాకు అసలే నిలిచిపోయింది. ఇది మూడో ముహూర్తం. ఈనాడు గూడ దాసరి కోటిరత్నం, గండికోట జోగినాధం గారలు ఎగగొట్టారు. ఎవరి తప్పో మాకెందుకు. లెండి!30 తేది రాత్రి నాటకం11-30 గం.లకు సరిగ్గా ప్రారంభమైంది. బైటవాకిట్లో రిజర్వుడు 35 అని వ్రాసి వుంది. లోపలబోతే 120 కి తగ్గదు. ఓహో; యిది హెల్తువారి కంట్లో దుమ్ముకొట్టె ఔషధం కాబోలు అనుకున్నాను. ఓ హెల్తు దేవతా! రు.5-0-0 లు, 3-8-0ల రకమంతా గాలిలేని ఆ నరక కూపంలో చావవలసిందేనా? నీ ధర్మాన మూత్రవిసర్జన ప్రదేశంలో లైటు, సున్నంగొట్టడం జరిగినందుకు వందనాలు.

-చిత్రగుప్తుడు

ఖాళీ స్థలము అమ్మబడును

మద్రాసు బస్‌స్టాండు దగ్గర స్వాతి రెస్టారెంటుకు అనుకుని వున్న రోడ్డు ఫేసింగ్ కలిగి వున్న ఖాళీ స్థలము మమారు 90 అంకణములు విక్రయించబడును.

వివరములకు

న్యూటాకీస్, నెల్లూరు.
ఫోను: 27338, 27478, 27334

నిమ్మతోట - పొలము అమ్మబడును

మనుబోలుకు దగ్గరలో, మడమనూరు గ్రామం, కాపుకు వచ్చిన 5 ఎకరాల నిమ్మతోట, చెరకు, సపోటాకు అనువైన 20 ఎకరాల పొలం 2 బోరు పాయింట్లు, పైపు లైను తోటి అమ్మబడును.

వివరాలకు

వి. రామలింగబాబు రెడ్డి
మడమనూరు గ్రామం
మనుబోలు S.O. నెల్లూరు జిల్లా

లాడ్జీ అమ్మకము

నెల్లూరు టౌన్‌హాలు ఎదురుగా ట్రంకురోడ్డులో వున్న మూడు అంతస్తులు గల మిద్దె క్రింది భాగము 9 కొట్లు, పై భాగము 20 గదులు గల మంచి రన్నింగ్ కండిషన్‌లో వున్న న్యూ డీలక్స్ లాడ్జి అమ్మబడును. క్రింది భాగంలోని అంగడి కొట్లు విడివిడిగా విక్రయించబడును.

వివరములకు

న్యూటాకీస్, నెల్లూరు.
ఫోను: 27338, 27241, 27769

చిత్రసమీక్ష

(9 పేజీ కొరవ)

సుస్మిత సీమా (శిల్పాశెట్టి) తో ప్రేమ గ్రంధం నడిపి పెళ్లివరకు తీసుకొస్తాడు. ప్రేమ పిచ్చిలో మునిగిన సీమ చేత ఆత్మహత్య చేసుకుంటున్నానని పుత్తరం రాయిస్తాడు. తాళి కడతానని హోటల్‌కు తీసుకెళ్లి పై అంతస్తునుండి క్రిందకు త్రోసి వేసి రాక్షసానందంతో తిరిగి వస్తాడు చోప్రా. అతని చిన్న కూతురు ప్రియా(కాజల్)కు విక్రమ్ మల్హోత్ర పేరుతో కారు రేసులో పరిచయమవుతాడు అజయ్. ప్రియా మనసు కూడా దోచి ముహూర్తాల వరకు వెళతాడు. చోప్రా తన కాబోయే అల్లుడని నమ్మి ధారాదత్తం చేసిన పవర్ పట్టాతో తన కుటుంబానికి అన్యాయం జరిగిన రీతిలోనే బుద్ధిచెబుతాడు. అజయ్ ప్రదర్శించే వింత చేష్టలతో అతడ్ని అనుమానించి వెంటాడిన ప్రియ అతనే తన అక్కను, ఆమె ఫ్రెండ్స్‌ను చంపిన హంతకుడని చివరన తెలుసుకుని కుమిలి పోతుంది. తన పంతం పూర్తిచేసుకునే ప్రయత్నంలో చోప్రాను అంతమొందించి తను ప్రాణాలు కోల్పోతాడు అజయ్.

చిత్రంలో షారూఖ్ ఖాన్ తన తొలి ప్రియురాలు శిల్పాశెట్టిని హోటల్‌పై నుండి త్రోసివేసే సన్నివేశం చూసిన ప్రేక్షకులు ఆ క్యారెక్టర్‌ను అసహ్యించు కుంటారు. ఫైట్స్‌లో గాజుపెంకులు ముఖాలకు గుచ్చుకున్న సన్నివేశాలు, పాటల్లో ప్రకృతి అందాలను చక్కగా చూపిన థామస్ కెమెరా- హోటల్‌పై నుండి హీరోయిన్‌ను త్రోసిన సన్నివేశంలో ఎందువల్లో ఆమె వంటికి కట్టిన తీగ కనపడేలా చేసింది. అల్కాయాగ్నిక్ ఆలపించిన 'బజామేరే చహేరేపర్ క్యాక్యా లిఖాహయ్' పాటతో పాటు పలుచోట్ల తొలిసారే అయినా చక్కని నటన ప్రదర్శించింది శిల్పాశెట్టి. భామన ఛాయలో పాలుబికే పసిబుగ్గలతో ఆకట్టుకునే చూపులతో ఒకప్పటి మేటి నటి తనూజ కూతురు కాజల్ తన పాత్రను చక్కగా పోషించిందనే చెప్పాలి. ఈమె అక్కడక్కడా హద్దుమీరి వంటి వంపులుఎక్స్‌పోజ్ చేసింది కూడా. 'బాజీగరో... బాజీగర్' టైటిల్ సాంగ్‌లో ముచ్చటేసేలా కనపడుతుంది కాజల్. హృదయంలో అగ్నిపర్వతాలు పేలుతున్నా పైకి కనబడనీయక ఒకవైపు ప్రేమికునిగా, మరోవైపు పగతో నిండిన ద్వేషిగా షారూఖ్ ఖాన్ రెండు పాత్రల్లో జీవించాడు. చివరి సన్నివేశంలోనైతే తల్లి ఒడిలో ప్రాణాలు విడుస్తూ ప్రేక్షకుల కంట కన్నీరొలికించాడు. అతని తల్లిగా రాఖీ చక్కని నటన ప్రదర్శించింది. 'ఏ కాలికాలి ఆంఖే' తో పాటు మిగతా పాటలకు చక్కని సంగీతమిచ్చి చిత్రానికే ప్రాణం పోశారు సంగీత దర్శకుడు అన్నూమల్లిక్. రాబిన్ భట్ రచనలో ప్రేమతో కామెడీ కూడా చక్కగా పండింది. సరోజ్-రాజుఖాన్ నృత్యాలు క్లాసికల్‌గా వున్నాయి. చిత్రంలో ప్రతి ఒక్కరిచేత ప్రతిభావంతంగా పనిచేయించడంలో దర్శక ద్వయం అబ్బాస్- మస్తాన్ విజయం సాధించారు.

నెల్లూరు సంగతులు

(4 పేజీ కొరవ)

వ్యవహరించడంతో పాటు, హేమర్ త్రోలో మొదటి స్థానం డిస్క్ త్రోలో మూడవ స్థానం పొందారు. ఆర్.ఎస్.ఐ. వి. వెంకటేశ్వర్లు హై జంప్‌లో ప్రతిభ చూపితే, అంతర్జాతీయ క్రీడాకారుడైన కానిస్టేబిల్ బసవయ్య పరుగు పందాలన్నింటిలో తనకు తిరుగు లేదనిపించాడు. మహిళా కానిస్టేబిళ్లు సంపూర్ణ, పుష్పవతి, వున్నీసా, సుజాత, షఫియా బేగం, పలుబహుమతులు పొందారు. టీమ్‌కు షేక్ సమీవుల్లా కెప్టెన్‌గా వ్యవహరించినట్లు వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్. మోహన్ రెడ్డి తెలుపుతున్నారు.

బ్రిడ్జి పోరాట శిబిరంలో చలివేంద్ర

విజయమహల్ గేటు వద్ద బాక్స్ టైపు బ్రిడ్జి నిర్మాణానికి ధర్నా చేసిన శిబిరంలో ఒక చలివేంద్రను 29 తేది మాజీ కౌన్సిలర్ వున్నం బసవయ్య ప్రారంభించారు. ధర్నా జరిగిన 28 రోజుల్లో గేటు వేసి వుండే సమయంలో ప్రజలు శిబిరంలోకి వచ్చి మంచినీళ్లు తాగివెళ్లే వారట. అందువల్ల అక్కడ మంచి నీటి ఆవశ్యకతను గుర్తించి చలివేంద్రను సిపిఎం, డివైఎఫ్ఐలు సంయుక్తంగా ఏర్పాటు చేశాయి.

ఫిర్యాదు చేయండి

తెలుగు గంగ, సోమశిల ప్రాజెక్టు పరిధిలోని ముంపు గ్రామాల ప్రజల నుండి పుద్యోగులు ముడుపులు స్వీకరించి బిల్లులు మంజూరు చేస్తున్నారన్న వార్తకు స్పెషల్ కలెక్టర్ ఉమా మల్లేశ్వర్ రావు స్పందించారు. బాధితులు, రైతులు ఏదైనా ఇబ్బందులకు గురైతే తక్షణం తనకు ఫిర్యాదు చేయమని కోరుతున్నారాయన.

అసెంబ్లీ బుద్ధిమంతుడు అవార్డు

సర్వేపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీ సి.వి. శేషారెడ్డి క్రమం తప్పకుండా శాసన సభ సమావేశాలకు హాజరై "మంచి బాలుడి" బహుమతి కొట్టేశారు. ఎమ్మెల్యేల క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల పోటీ సందర్భంగా నగరంలోని రవీంద్రభారతిలో సోమవారం జరిగిన సభలో శేషారెడ్డి ఈ బహుమతిని అందుకున్నారు. శాసన సభ సమావేశాలంటేనే ఎమ్మెల్యేలకు మొహం మొత్తిన ఈరోజుల్లో రెగ్యులర్‌గా సమావేశాలకు హాజరు కావడం మంటే చిన్న పనికాదు. సమావేశం మొదలైన దగరనుంచి రణగొణ ధ్వనులు,



ముష్టాముష్టి బాహా బాహి సీన్ల మధ్య ఓపిగ్గా అసెంబ్లీలో కూర్చోవడమంటే నిజంగా రికార్డే.

గతంలో శ్రీ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా విధిగా సమావేశాలకు హాజరయ్యేవాడే కానీ మధ్యలో లేచి ఇంటికి వెళ్లిపోయేవాడు. శేషారెడ్డి అలాగాక ఉదయం మొదలుకొని సాయంత్రం దాకా అసెంబ్లీ చూరు పట్టుకొని వేళ్లాడు తుంటాడు. శేషారెడ్డితోపాటు వంగవీటి చలపతిరావు (కాంగ్రెస్), అశోక గజపతిరాజు (తె.దే), విఠల్ రెడ్డి (సిపిఐ) కూడా మంచి ఎమ్మెల్యేల బహుమతులు అందుకున్నారు.

కోట్లతో వుండే వారి పేర్లు నాలుగు చెప్పండి!

- రాష్ట్ర మంత్రులకు పివి ప్రశ్న

వ్యతిరేకించడం లేదా? వారిని కలుపుక రాకుండా సమస్యను జటిలం చేయడం వల్ల వచ్చే ఎన్నికల్లో మనం గెలవ గలమా? అంటూ పి.వి. కోపంలో అన్నారట. దీన్నిబట్టి పి.వి. అంతర్యాన్ని కోట్ల వ్యతిరేకులు రకరకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. అయితే కోట్ల మద్దతుదారులు మాత్రం ప్రస్తుతానికి ఢోకా లేదని ఎమ్మెల్యేలకు నచ్చజెప్పుకునే కార్యక్రమంలో వున్నారు. కోట్ల వారు ఢిల్లీ నుంచి వచ్చాక ఎమ్మెల్యేలతో సాన్నిహిత్యం

మూలవిరాట్
(మొదటి పేజీ కొరవ)

పెంచుకోవడానికి విఫలయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్‌లో ఏమి జరుగుతున్నదన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా తయారైంది. ఏది ఏమైనా మరో వారం పది రోజుల్లో అధిష్టానం దేవుడు తన నోరు విప్పుతాడని అందరూ ఎదురు చూస్తున్నారు. అధిష్టానం దేవుడి మనసులో వున్న గుట్టు రట్టయితే గానీ అసలు విషయం బయటపడదు. అప్పటిదాకా ఈ సస్పెన్స్ 'ప్రతిష్టంభన' ఊగిసలాట కొనసాగుతూనే వుంటాయి.

సినిమా

(9 పేజీ కొరవ)

నేనే తమిళంలో సొంత చిత్రం ఓ.బలేనా అనుకుంది కామోసు. బాలు మహేంద్ర చెప్పిన కథ ఒకటి ఆమెకు నచ్చింది. ఆయన దర్శకత్వంలో వెంటనే చిత్ర నిర్మాణానికి పూనుకుంది.

అర్జున్ సొంత చిత్రం

అర్జున్ స్వీయ దర్శకత్వంలో "జై హింద్" అనే చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఇందులో చివరి సన్నివేశంలో ఒక దేశభక్తి గీతం ఉంది. ఆ చిత్రీకరణలో పేరు మోసిన తెలుగు, తమిళ హీరోలను గెస్టులుగా నటింప చేయడానికి అర్జున్ తాపత్రయ పడుతున్నాడు.

ఎస్. గోపాలరెడ్డి చిత్రం

దాదాపు 15విజయవంతమైన చిత్రాలను నిర్మించి, అశేష అభిమానులను సంపాదించిన నెల్లూరీయుడు, భార్గవ్ ఆర్ట్స్ అధినేత ఎస్.గోపాలరెడ్డి స్టార్ ప్రొడ్యూసర్. ఈయన కోడి రామకృష్ణ దర్శకత్వంలో "తెలుగు గంగ" అనే చిత్రాన్ని నిర్మించదలచి, ఒక పాటను కూడా రికార్డ్ చేశారు ప్రారంభోత్సవం నాడు 50లక్షల రూపాయలతో అవుతుందనుకున్న ఆ చిత్రం బడ్జెట్ షూటింగ్ ముగిసేసరికి కోటి రూపాయలదాకా పెరగ వచ్చని తేలింది. దాంతో ఆయన ఆ ప్రాజెక్ట్‌ను ప్రక్కన పెట్టి, నెల్లూరు జిల్లాలో 'ఆక్వా ఫామ్' ప్రారంభిస్తున్నారు. ఈలోగా ఆయన సంక్రాంతికి తమిళనాడులో విడుదలై విరవిహారం చేస్తున్న కమలహాసన్ చిత్రం "మహానది"ని అదే పేరున తెలుగులోకి డబ్ చేయనారంభించారు.

గూడూరు సబార్డినేట్ కోర్టులో

E.P. 17/92 :: O.S. 98/87

గిద్దలూరు రామచంద్రా రెడ్డి - DHr

Vs

నందవరం కాంతమ్మ - JDr

పై నంబరు E.P. లోని డిక్రీ బాకీని రాబట్టుకొను నిమిత్తం J.Dr తాలూకు స్థిరాస్తిని 18.4.94 తేదిన పగలు 10 గంలకు పై కోర్టులో బహిరంగముగా వేలం వేయబడును.

షెడ్యూలు

నెల్లూరు జిల్లా రిజిష్టేషను, గూడూరు స.రి.లో చేరిన చిల్లకూరు మండలం, చిల్లకూరు గ్రామంలో J.Dr కు హక్కు అనుభవం గల స్థిరాస్తి వివరం:

వ. నం	పట్టా నం	సర్వే నం	విస్తీర్ణం	అనుభవ విస్తీర్ణం	దావత్తు హెక్టార్లు		DHr Value	Amine Value
1	239	89	య2.13 సెం.	య1.63 సెం.	మాగాణి	.065	8000/-	11,410

యిందుకు హద్దులు: తూర్పు: యద్దల క్రిష్ణమ్మ కొంత వరకు, కరణం మాన్యం; దక్షిణం: పంట కాలువ; పడమర: యదనపర్తి ఆదినారాయణ రెడ్డి; ఉత్తరం: మేనకూరు పెంటారెడ్డి

2	368	99B1	య0.37 సెం.	య0.37 సెం.	మాగాణి	.015	2000/-	2,960/-
3	368	99D	య0.41 సెం.	య0.41 సెం.	మాగాణి	.016	2000/-	2,460/-
4	219	99E	య0.31 సెం.	య0.31 సెం.	మాగాణి	.012	2000/-	1,860/-
5.	368	99/F1	య0.24 సెం.	య0.24 సెం.	మాగాణి	.010	2000/-	1,440/-
6	74	180.1A	య0.49 సెం.	య0.49 సెం.	మాగాణి	.020	4000/-	2,940/-

N.B. (1) గూడూరు అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ బ్యాంకు వారికి 25.3.79 తేదిన రూ. 8000/- లకు ఆడుమానం.

(2) 25.3.79 తేదిన గూడూరు అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ బ్యాంకు వారికి రూ. 1500/- లకు ఆడుమానం.

(3) చిల్లకూరు M.P.C.C. వారికి 24.5.76 తేదిన రూ. 600/- లకు ఆడుమానం బాకీలకు లోబడి యాలం వేయబడును.

C.V. Subba Reddy, Advocate for the D.H.R



PINAKINI
SHEEP FARMS PVT. LTD.,

16/792, SANKARA AGRAHARAM, NELLORE.
PHONE: 28939

- భారతదేశం లోనే మొట్టమొదటి సారిగా.
- 3000/- వేల పెట్టుబడి - 30,000 వేలరాబడి.
- అతి తక్కువ పెట్టుబడి - అత్యధిక రాబడి.
- ప్రతి సంవత్సరం లాభాయం అందుకునే పథకం.
- 10 సంవత్సరములు అతి తక్కువ కాలం.
- యూనిట్‌కు పూర్తి సంరక్షణ, భద్రత.
- యూనిట్‌కు పూర్తి భీమా భద్రత.
- అత్యంత ఆధునిక సాంకేతిక పర్యవేక్షణ.
- ఎప్పుడైనా మీ పెట్టుబడి తిరిగి పొందే సదుపాయం.

OUR GROWTH IS
NATION'S GROWTH.
OUR WEALTH IS
NATION'S WEALTH.

మేనేజింగ్ డైరెక్టర్,
చీదెల్ల వెంకటేశ్వర్లు.

Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press, OFFSET Printing at Nayagara Paper Products (India) Ltd.,